తెలుగు
# జనశక్తి
TELUGU JANA SAKTHI
RNI NO: TEL TEL/2024/89275

| కామారెడ్డి | సంపుటి :02 | సంచిక :281 | సోమవారం, 27 అక్టోబర్ 2025 | పేజీలు:8 | వెల-4/- |
|---|---|---|---|---|---|
| Kamareddy | Volume:02 | Issue: 281 | Monday October 27, 2025 | page's:8 | Rs:4/- |


**విలేఖరులు కావలెను.**

తెలుగు జనశక్తి

సామాజిక స్పృహతో, అవినీతి అక్రమాలను వెలికితీసే ధైర్యం,
ప్రజాసమస్యలను నిర్భయంగా రాసే వారికి
**తెలుగుజనశక్తి దిన పత్రిక** అవకాశం కల్పిస్తుంది.
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారిగా
స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజక వర్గాల వారిగా ఆర్సి ఇన్‌చార్జిలు,
మండలాల వారిగా రిపోర్టర్‌లు కావలెను.

**సెల్: 6302660543**




## రమ్యశ్రీ త్యాగానికి సెల్యూట్..!

తెలంగాణ: మానవత్వం, దాతృత్వం మూర్తీభవించిన అద్భుత ఘట్టం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. కేవలం 28 ఏళ్ల చిన్న వయసులోనే బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించబడిన ఓ గృహిణి.. అవయవ దానం ద్వారా ఏకంగా ఆరుగురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలకు కొత్త వెలుగును ప్రసాదించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన బండిగారి రమ్యశ్రీ అనే గృహిణి ఈ అరుదైన దాతృత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

›06



## బస్సు ప్రమాదంలో ఇద్దరి మీద కేసు నమోదు

కర్నూలు: జిల్లా, చిన్న టేకూరు వద్ద చోటు చేసుకున్న బస్సు యాక్సిడెంట్‌లో 19 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి బెంగ-ళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయ్యారు. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి కారణమైన బైకర్ శివశంకర్ మీద కేసు నమోదు అయ్యింది.

›07



## మొంథా తుపాను.. చంద్రబాబు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్: మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొ స్తుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నేటి నుంచి బుధవారం వరకు భారీ వర్షాలు కురుస్తా యని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 28న తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని తెలిపారు. ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొంథా తుపాను నేపథ్యంలో అధికారు లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపానును ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన వారిని వెనక్కి రప్పించాలని తెలిపారు. దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, 'మొంథా' తుఫాన్ ముప్పు నేపథ్యంలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపానును ఎదుర్కోవడానికి అధికారు లంతా సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. తుపాను నేపథ్యంలో ఆ ప్రభావిత ప్రాంతాల్లో.. కరెంట్, టెలికాం, తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

›07



## మొంథా వచ్చేస్తోంది!

కోస్తా జిల్లాలపైకి 'మొంథా' తుపాను దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. అది ఆదివారం సాయంత్రానికి పోర్టుబ్లెయిర్‌కు 670 కిలోమీటర్లు, చెన్నైకు 720, కాకినాడకు 780, విశాఖపట్నానికి 790, గోపాలపూర్ (ఒడిశా)కు 900 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయంలోగా నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.



## స్వేచ్ఛా వాణిజ్యం బలోపేతం

ఇష్టారీతిగా వ్యవహరిస్తూ అన్ని దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల సుత్తితో మోదుతున్న వేళ ఆసియాన్ దేశాలతో బంధంపై భారత్ దృష్టిసారించింది. ఆసియాన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం బలోపేతమే లక్ష్యంగా భారత్ ముందుకెళ్తుందని ప్రధాని మోదీ ప్రకటించారు. అనిశ్చిత పరిస్థితుల్లోనూ ప్రపంచ సుస్థిరతకు, ప్రగతికి భారత్%-%ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం శక్తివంతమైన పునాదిగా మారుతోందని మోదీ వ్యాఖ్యానించారు.


›02

# బీఆర్ఎస్‌కు మళ్లీ గుర్తుల గుబులు..

**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. నామినేషన్ల విత్‌డ్రా ముగిసిన అనంతరం బరిలో నిలిచిన 58 మంది అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తాజాగా ఎన్నికల గుర్తులను కేటాయించింది. దీంతో అభ్యర్థులంతా తమ ప్రచారాన్ని వేగవంతం చేసే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నారు. అయితే ఈసీ కేటాయిం చిన గుర్తులు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో, ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శ్రేణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.తమ సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు.. గతంలో మాదిరిగానే ఈ ఉప ఎన్నికలోనూ గుర్తుల టెన్షన్ తప్పేలా లేదు.

బీఆర్ఎస్ ఎన్నికల గుర్తు అయిన కారును పోలిన సింబల్స్ పలు స్వతంత్ర అభ్యర్థులకు, చిన్న పార్టీలకు కేటాయించడం ఆ పార్టీని కలవరపెడుతోంది. ముఖ్యంగా రోడ్ రోలర్, చపాతీ మేకర్ వంటి గుర్తులు తమ ఓట్లను గల్లంతు చేస్తాయనే భయం బీఆర్ఎస్ నాయకుల్లో ఉంది.గతంలో జరిగిన చాలా ఎన్నికల్లో కారు గుర్తును పోలిన సింబల్స్ కారణంగా వృద్ధ ఓటర్లు, దృష్టిలోపం ఉన్నవారు తికమకపడి తప్పుడు గుర్తుకు ఓటు వేశారని, దానివల్ల తమకు నష్టం జరిగిందని బీఆర్ఎస్ నేతలు చాలా కాలంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రోడ్ రోలర్,

-మిగతా 2లో




# కొందరు ఎమ్మెల్యేలకూ డీసీసీ పీఠాలు!

**కొన్ని చోట్ల కార్పొరేషన్ ఛైర్మన్లకూ ఇచ్చే అవకాశం**

### అత్యధికంగా కొత్త తరానికే పగ్గాలు

**జూబ్లీహిల్స్‌లో మంచి మెజార్టీతో గెలుస్తాం**

**'మంత్రుల పంచాయితీ'పై కేసీ.. సీఎంను అడిగారేమో తెలియదు..**

**కవిత పూర్తి నిజాలు చెప్పాలి.. ఆమె ఎవరో వదిలిన బాణం కావచ్చు**

**ఢిల్లీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు**



**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** ఢిల్లీ: "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ మంచి మెజార్టీతో గెలుస్తుంది. ఆ నియోజకవర్గంలో 70% ప్రాంతంలో మురికివాడలు, మధ్యతరగతి ఆవాసాలే ఉన్నాయి. అక్కడి ప్రజలంతా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారు. మా అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు 15 ఏళ్లుగా ప్రజలతో సత్సంబంధా లున్నాయి. కాంగ్రెస్‌ను బలపరిస్తే ప్రజలకు సంక్షేమం సంపూర్ణంగా అందుతుంది" అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నా రు. డీసీసీ అధ్యక్షుల ఎంపికపై చర్చించేందుకు ఢిల్లీకొచ్చిన ఆయన ఆదివారం తెలంగాణభవన్‌లో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ వివిధ అంశాలపై

-మిగతా 2లో



## ఛత్తీస్‌గఢ్‌లో 21 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. కాంకేర్ జిల్లాలో ఆదివారం 21 మంది మావోయిస్టులు 18 ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరంతా మావోయిస్టు పార్టీ నార్త్ సబ్ జోనల్ బ్యూరో పరిధిలోని కున్వేమరి, కిస్కోడో ఏరియా కమిటీకి చెందిన వారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు-(డీవీసీఎం), 9 మంది ఏరియా కమిటీ సభ్యులు-(ఏసీఎం), 8 మంది పార్టీ కమిటీ సభ్యులతో పాటు డివిజన్ కమిటీ కార్యదర్శి ముకేశ్ సైతం ఉన్నారు. వీరిలో 13 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు. మూడు ఏకే-47 రైఫిల్స్‌తోసహా మొత్తం 18 ఆయుధాలతో ముకేశ్ నేతృత్వంలో తడోకీ పోలీసుస్టేషన్ ప్రాంతంలోని చోటేథాన్సా అడవులకు వీరంతా చేరుకున్నారు. అక్కడ నుంచి పోలీసులు భారీ భద్రత నడుమ ప్రత్యేక వాహనాల్లో అంటగఢ్‌కు తీసుకొచ్చారు. ఒకటి, రెండ్రోజుల్లో వీరి లొంగుబాటును అధికారికంగా చూపనున్నారు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్‌శర్మ వెల్లడించారు.




**ఈ నెల 27న ఈసీ ప్రెస్‌మీట్..**

## దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'పై కీలక ప్రకటన!

**తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** బిహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఈ నెల 27న సాయంత్రం 4.45 గంటలకు మీడియా సమావేశం నిర్వహించను న్నట్లు వెల్లడించింది. తొలిదశలో భాగంగా 10-15 రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్' నిర్వహణపై సోమవారం ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు సమాచా రం. వచ్చే ఏడాది ఎన్నికలకు వెళ్లనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలు ఈ జాబి తాలో ఉన్నట్లు తెలుస్తోంది.'ఎస్ఐఆర్' కార్య్రకమానికి రాష్ట్రాల సీఈవోలు సన్నద్ధం కావాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఢిల్లీలో నిర్వహించిన సీఈవోల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఈ మేరకు సూచనలు జారీ చేశారు. 'ఎస్ఐఆర్'పై అనుమానాలను నివృత్తి చేశారు. అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో పరిస్థితులను తెలుసుకున్నారు. దేశంలోని చాలావరకు రాష్ట్రాలు 2002-04 మధ్యకాలంలో ఓటరు జాబితాల సమగ్ర సవరణ చేపట్టాయి.



## మరో స్లీపర్ బస్సులో మంటలు..

**ప్రయాణికులు సురక్షితం**

ఆగ్రా-లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై మరో ప్రైవేటు బస్సు లో మంటలు చెలరేగాయి. ఢిల్లీ నుంచి లఖ్‌నవూ మీదుగా గోండా ప్రాంతానికి వెళ్తున్న ఏసీ స్లీపర్ బస్సులో రెవ్రి టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం మంటలు చెలరేగాయి. తెల్లవారుజా మున 4:45 గంటల ప్రాంతంలో టోల్ ప్లాజాకు 500 మీటర్ల ముందు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణి కులందరినీ కిందకు దించేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమా చారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని.. మంటలు ఆర్పివేశారు. బస్సులో ఉన్న దాదాపు 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మొదట బస్సు చక్రంలో ప్రారంభమైన మంటలు వాహనం లోని మిగిలిన భాగాలకు వ్యాపించినట్లు డ్రైవర్ జగత్ సింగ్ తెలిపాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న ప్రైవేటు బస్సు యాజమాన్యం ప్రయాణికులకు మరో బస్సును ఏర్పాటు చేసింది. బస్సుకు మంటలు అంటుకోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## టీటీడీ పరకామణి వ్యవహారం కోట్లాది భక్తులను కలిచివేసింది

**బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు**



**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** టీటీడీలో వెలుగుచూసిన పరకామణి వ్యవహారం దేశవ్యా ప్తంగా కోట్లాది భక్తులను తీవ్రంగా కలిచివేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థానం పట్ల ప్రజల విశ్వాసం, ఆధ్యాత్మికత, భక్తి అన్నీ ఈ వ్యవహారంలో దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఈ ఘటనను చిన్నదిగా చూడడం తప్పు అని స్పష్టం చేస్తూ, ఇది భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే

-మిగతా 2లో



## రెవెన్యూ భూములు అటవీ భూములుగా మారనున్నాయి..

**427 ఎకరాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** ప్రాజెక్టుల నిర్మాణాల్లో ముంపునకు గురైన అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ భూములను కేటాయించింది. అటవీ శాఖకు బదలాయించిన భూములను అటవీ శాఖ భూములుగా గుర్తిస్తూ

-మిగతా 2లో

## ఇందిరమ్మ ఇండ్లు బిల్లుల చెల్లింపుల్లో మార్పులు..

**మంత్రి పొంగులేటి విజ్ఞప్తి**



›02

# కొందరు ఎమ్మెల్యేలకూ డీసీసీ పీఠాలు!

మొదటి పేజీ తరువాయి

స్పందించారు. ఆ వివరాలు ఇలా...

**ఎమ్మెల్యేలకు డీసీసీ.. జోడు పదవుల కిందికి రాదు..**

- "ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన నియోజకవర్గంలో జాబ్‌మేళా కారణంగా.. డీసీసీలపై ఏఐసీసీ నాయకులతో సమావేశానికి రాలేకపోయారు. ఆయన తన అభిప్రాయాన్ని ప్రత్యేకంగా అధిష్ఠానానికి పంపుతారు. ఏఐసీసీ మార్గదర్శకాల ప్రకారం 50%కి పైగా పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కుతాయి. ఇందులో అత్యధికంగా కొత్త తరం నాయకులే వస్తారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లనూ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి, ఎమ్మెల్యే పద్మావతి డీసీసీ పదవికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఇలాంటి పేర్లపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. వారిద్దరూ 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నందున ఒకే కుటుంబానికి రెండు పదవులన్న సిద్ధాంతం వర్తించదు. కోమటిరెడ్డి సోదరులు కూడా అంతే. ఎమ్మెల్యేలకు డీసీసీ ఇవ్వడం.. జోడు పదవుల కిందికి రాదు. ప్రస్తుతం ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేల పేర్లు డీసీసీలకు పరిగణనలో ఉన్నాయి.
- బీసీలకు మేం పార్టీపరంగా 42% సీట్లు ఇచ్చినా.. ప్రత్యర్థి పార్టీలు ఇవ్వకపోతే దానికి విలువ ఉండదు. అందుకే రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం పోరాడుతున్నాం. మధ్యప్రదేశ్‌లో 72% రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న భాజపా.. రాష్ట్రంలో ఎందుకు అడ్డుపడుతోందో తెలియదు.

**అందరం హైకమాండ్ రాడార్‌లో ఉన్నాం..**

- మంత్రుల పంచాయితీ గురించి కేసీ వేణుగోపాల్.. సీఎంను అడిగారేమో నాకు తెలియదు. కొండా సురేఖ కుమార్తె కులాల గురించి మాట్లాడటం సరికాదు. ఆమె మాటలను పట్టుకుని కేటీఆర్, హరీశ్‌రావు మా పార్టీని నోటికొచ్చినట్లు విమర్శించారు. పోలీసులు సుమంత్ అనే వ్యక్తిని వెతికే క్రమంలో కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగానే అక్కడికి వెళ్లారు తప్ప.. మంత్రి సురేఖ ఇంటిని లక్ష్యంగా చేసుకోలేదు. అది మంత్రి అధికార నివాసం కాదు. ఈ వివాదంపై అధిష్ఠానానికి వివరణ పంపాం. నాతో సహా అందరూ హైకమాండ్ రాడార్‌లో ఉన్నారు. ఎవరు తప్పు చేసినా చర్యలుంటాయి.

**మెట్రోను పట్టించుకోని కిషన్‌రెడ్డి, సంజయ్**

- మతపరమైన వివాదాలతో తప్ప.. సొంతంగా చేసిన పనులు చెప్పి ఓట్లు అడిగే సత్తా భాజపాకు లేదు. మెట్రో రైలు ప్రాజెక్టు హైదరాబాద్‌కు ఎంతో అవసరమైనా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దాని గురించి మాట్లాడటం లేదు. తమిళనాడులో రాష్ట్ర సమస్యలపై అన్ని పార్టీలూ ఒక్కటై పోరాడుతున్నాయి. కానీ మన దగ్గర అలాంటి ధ్యాస లేదు. గుజరాత్‌లోని భాజపా ప్రభుత్వం సబర్మతి ఆధునికీకరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఎలాంటి పునరావాసం కల్పించలేదు. కానీ మేం మూసీ ఆధునికీకరణలో నిర్వాసితులయ్యే వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడానికి సిద్ధమయ్యాం. దీనికి కేంద్రం రూపాయి కూడా ఇవ్వడం లేదు.
- మద్యం హాలోగ్రామ్‌కి సంబంధించి 2017 నుంచి ఒకే కాంట్రాక్టర్ ఎలా కొనసాగుతున్నారో ఐఏఎస్ అధికారి రిజ్వీ సమాధానం చెప్పాలి. నిబంధనల ప్రకారం మంత్రి లేఖ రాసినప్పుడు అధికారి సమాధానం చెప్పాల్సిందే.
- రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ అప్పట్లో అంత ఉదాసీనంగా మాట్లాడకపోయి ఉంటే బనకచర్ల జీవోనే వచ్చేది కాదు. ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేస్తే స్వాగతిస్తాం. భారాస పాలనలో జరిగిన అన్యాయాలపై ఆమె సగం సగం కాకుండా పూర్తి నిజాలు చెప్పాలి. ఆమె కూడా ఎవరో వదిలిన బాణం కావొచ్చని నా అనుమానం" అని మహేశ్‌గౌడ్ అన్నారు.

# అలర్ట్.. 'ఇందిరమ్మ ఇండ్లు' బిల్లుల చెల్లింపుల్లో మార్పులు..

## లబ్ధిదారులు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో స్వల్ప మార్పులు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నాలుగు విడతలుగా అందజేస్తున్న బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో స్వల్ప మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 పని దినాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (ఐహెచ్‌హెచ్‌ఎల్) పనులను చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ఈ మార్పు అనివార్యమైందని ఆయన తెలిపారు. కేవలం చెల్లింపుల షెడ్యూల్‌లో మాత్రమే మార్పులు జరుగుతాయని.. లబ్ధిదారులకు మంజూరు చేసే రూ.5 లక్షల మొత్తంలో ఎలాంటి మార్పు ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో బేస్‌మెంట్ వరకూ నిర్మాణం పూర్తయితే లక్ష రూపాయలు, రూఫ్ లెవల్ వరకు వచ్చిన తరువాత మరో రూ.లక్ష విడుదల చేస్తున్నారు. అలాగే.. ప్రస్తుతం రూఫ్ పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు రూ.2 లక్షలను చెల్లిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కలుగుతున్న లబ్ధి (90 రోజుల పనిదినాలమొత్తం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం నిర్దేశించిన మొత్తం) వారి ఖాతాల్లోకే నేరుగా జమ అవుతుంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఇంటి శ్లాబ్ వేసిన తర్వాత చెల్లించే మొత్తాన్ని రూ.1.40 లక్షలుగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి వివరించారు. ఇకపై శ్లాబ్ పూర్తయిన తర్వాత రూ.1.40 లక్షలను మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని, మిగిలిన మొత్తాన్ని (రూ.60 వేలను) కూడా లబ్ధిదారుల ఖాతాల్లో ఉపాధి హామీ పథకం కింద అందజేస్తారని తెలిపారు. అలాగే ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత మిగిలిన లక్ష రూపాయలను విడుదల చేస్తారు. పరిపాలనా సౌలభ్యం రీత్యా ఈ మార్పులు అనివార్యం అయ్యాయని, లబ్ధిదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్‌కు మళ్లీ గుర్తుల గుబులు..

మొదటి పేజీ తరువాయి

చపాతీ మేకర్, సోప్ బాక్స్, కెమెరా వంటి సింబల్స్‌ను రద్దు చేయాలని గతంలో ఈసీకి విజ్ఞప్తి కూడా చేశారు. కానీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాజాగా కేటాయించిన గుర్తుల్లో మళ్లీ అవే సింబల్స్ కనిపించడంతో బీఆర్ఎస్ టెన్షన్ రెట్టింపైంది. బ్యాలెట్ పేపర్‌లో గుర్తుల స్థానాలను పరిశీలిస్తే... బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి (కమలం) మొదటి స్థానం, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు (హస్తం) రెండో స్థానం, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌కు (కారు) మూడో స్థానం కేటాయించారు. అయితే ఇదే ఈవీఎం యూనిట్‌లో కారు గుర్తుకు దగ్గరగా ఉండే ఇతర సింబల్స్ ఉన్నాయి. 5వ నంబర్‌లో సోప్ డిష్, 9వ నంబర్‌లో చపాతీ రోలర్, 13వ నంబర్‌లో రోడ్ రోలర్, 21వ నంబర్‌లో కెమెరా వంటి గుర్తులు ఉన్నాయి. సాధారణంగా ఒక బ్యాలెట్ యూనిట్‌పై నోటాతో సహా 16 పేర్లు ఉంటాయి. అంటే, మొదటి ఈవీఎం యూనిట్‌లోనే బీఆర్ఎస్ కారు గుర్తుతో పాటు దాన్ని పోలిన గుర్తులు ఉండటం వలన ఓటర్ల గందర గోళం పెరిగే అవకాశం ఉంది. ఈ గుర్తుల గండం నుంచి బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికలో ఎలా బయటపడుతుందో అనేది ఆసక్తికరంగా మారింది.

# టీటీడీ పరకామణి వ్యవహారం కోట్లాది భక్తులను కలిచివేసింది

మొదటి పేజీ తరువాయి

పెద్ద విషయం అని పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఒక వ్యక్తి నేరం చేసిన తర్వాత డబ్బు తిరిగి ఇచ్చినా, ఆ నేరం రద్దవదని, చట్టప్రకారం నేరం నేరంగానే మిగిలిపోతుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు పరకామణి లెక్కల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, కౌంటింగ్ చేసే సిబ్బంది ఎంపిక నుంచి సీసీ కెమెరాల పర్యవేక్షణ వరకు ఆధునిక టెక్నాలజీ వినియోగించాలన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి భక్తుల నమ్మకానికి సమాధానం ఇవ్వాలని, టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ ఈ విషయాన్ని ప్రజల ముందు ఉంచినందుకు ప్రశంసించారు. ఈకార్యక్రమంలో జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి, ఎల్వీ సుబ్రహ్మణ్యం, చిలుకూరు రంగరాజన్ స్వామి, జె.డి. లక్ష్మీనారాయణ ప్రసంగించారు. ఇటువంటి వ్యవహారాలను సిస్టమ్ లోపాలుగా కాకుండా భక్తుల నమ్మకానికి ద్రోహంగా పరిగణించాలని అన్నారు. భక్తుల విరాళాల వినియోగంపై పబ్లిక్ డిస్క్లోజర్ సిస్టమ్ అమలు చేయాలని సూచించారు.



# రెవెన్యూ భూములు అటవీ భూములుగా మారనున్నాయి..

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం, మొండికుంట వాగుపై నిర్మించిన మీడియం రిజర్వాయర్ నిర్మాణంలో అటవీ శాఖ భూములు ముంపునకు గురయ్యాయి. ఈ భూమికి బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో చోటా ప్రభుత్వ (రెవెన్యూ) భూమిని కేటాయించింది. తాజాగా కేటాయించిన ఈ భూములను అటవీశాఖ భూములుగా నోటిఫై చేస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన అటవీ భూమికి బదులుగా 399.02 ఎకరాల భూమిని వేరు వేరు సర్వే నెంబర్లలో, వివిధ ప్రాంతాల్లో కేటాయించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామపరిధి సర్వే నెంబర్ 61 లో మొత్తం 124.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో నుంచి 84.27 ఎకరాల భూమిని అటవీ శాఖకు పరిహారం కింద కేటాయించారు. హనుమకొండ జిల్లా భీమదేవరంపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ పరిధిలో సర్వే నెంబరు 340/15/2లో 30.13 ఎకరాలు, సర్వే నెంబర్ 353/14/2 లో 185.17 ఎకరాలు, సర్వే నెంబర్ 355/1/2లో 98.25 ఎకరాలు రెవెన్యూ భూమిని కేటాయించారు. ఈ భూమికి అటవీ శాఖ హద్దులు గుర్తిస్తూ రెవెన్యూ భూమి నుంచి అటవీశాఖ భూమిగా నోటిఫై చేస్తూ నోటిఫికేషన్ ను జారీ చేసింది. ములుగు జిల్లాలో మొండివాగు కుంట పై నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోయిని అటవీశాఖ భూమికి బదులుగా ములుగు జిల్లా వాజేడు మండలం లక్ష్మీపురం గ్రామం సర్వే నెంబర్ 50/2 లో ఉన్న 28.20 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు బదలాయించారు. ఈ భూమి అటవీ భూమిగా గుర్తిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భూమి తాలుకు సంబంధించిన సమగ్ర వివరాలు పేర్కొంటూ, సరిహద్దులు ఏర్పాటు చేశారు. అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తించారు. ఈ భూములకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని అటవీశాఖ సంబంధిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.



# గోమాత మత విశ్వాసం కాదు

## కేంద్ర మండి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** గోసంతతిని కాపాడుకోవడం మత విశ్వాసం కాదని, గోవును కాపాడితే ప్రకృతిని కాపాడినట్లేనని, ప్రకృతిని కాపాడితే మన భవిష్యత్తును కాపాడినట్లేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లాంలోనూ కొందరు మత పెద్దలు గోవును పక్కన పెట్టుకుని నమాజ్ చేసిన దృశ్యాలను తాను చూశానని పేర్కొన్నారు. ఆదివారం నారాయణగూడ కేఎంఐటీ ఇంజనీరింగ్ కాలేజీలు, తెలంగాణ గో సేవా విభాగం ఆధ్వర్యంలో గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజానం"పై రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహించారు. విజేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాలు, పట్టణాల్లోకే కాకుండా గ్రామాల్లోకి కూడా పాల ప్యాకెట్లు, పాల పౌడర్ డబ్బాలు, ప్యాకేజ్డ్ మిల్క్ ప్రొడక్ట్స్ అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. నూటికి 90 శాతం మంది వాటిపైనే ఆధారపడి జీవించే పరిస్థితిలోకి వచ్చారని లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు తినే తిండి, తాగే నీళ్ల వరకు అన్నీ కలుషితం అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం, మన జీవన విధానాన్ని మర్చిపోయి విదేశీ సంస్కృతి, జీవన విధానానికి అలవాటు పడటమే ప్రధాన కారణం. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మన భవిష్యత్ తరాల మనుగడే ప్రమాదంలోకి వెళ్లే అవకాశముంది. భారతీయ మూలాలపై నేటి తరానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.గోవు పేడ పొలాలకు ఎరువుగా పనిచేసి నేల సారాన్ని పెంచుతుందన్నారు. బయో గ్యాస్ తయారీకి ఉపయోగపడుతుంది. పిడకలు కాల్చినప్పుడు వాయు కాలుష్యం తగ్గుతుంది. పేడతో ఇళ్లు పూయడం వలన యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. గోమూత్రం అనేక వైరస్‌లను చంపే గుణాలు కలిగి ఉందన్నారు. ప్రభుత్వాలు గోమాత పేరుతో పథకాలు ప్రకటిస్తాయని అవి కాగితాలకే పరిమితమైందని, కొందరైతే గోమాత సంరక్షణను కేవలం మతపరమైన అంశంగా చూస్తున్నారు. గోవును కోల్పోతే ఏమవుతుందో కూడా ఆలోచించడం లేదు. గోవు లేకపోవడంతో రైతులు రసాయన ఎరువులకు బానిసలయ్యారు. భూమాతను, సమస్త ప్రకృతిని కాపాడే గోమాతను విస్మరించి రోడ్డు పాల్జేయడం అంతకంటే ఘోరం ఉండదన్నారు. గోవులను కాపాడేందుకు మోడీ ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ మిషన్ అన్ నాచరల్ ఫామింగ్, లైవ్ స్టాక్ హెల్త్ అండ్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ , నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డైరీ డెవలప్మెంట్, నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ లాంటి పథకాలతో గోవుల సంతతి పెరిగేటట్లుగా చేస్తుందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులపై సున్నా శాతం జీఎస్టీ విధించినట్లు పేర్కొన్నారు.

# స్వేచ్ఛా వాణిజ్యం బలోపేతం

ఇష్టారీతిగా వ్యవహరిస్తూ అన్ని దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల సుత్తితో మోదుతున్న వేళ ఆసియాన్ దేశాలతో బంధంపై భారత్ దృష్టిసారించింది. ఆసియాన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం బలోపేతమే లక్ష్యంగా భారత్ ముందుకెళ్తుందని ప్రధాని మోదీ ప్రకటించారు. అనిశ్చిత పరిస్థితుల్లోనూ ప్రపంచ సుస్థిరతకు, ప్రగతికి భారత్%–%ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం శక్తివంతమైన పునాదిగా మారుతోందని మోదీ వ్యాఖ్యానించారు. మలేసియాలోని కౌలాలంపూర్ నగరంలో ఆదివారం ప్రారంభమైన ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో మోదీ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ శాంతిభద్రతలకు ఉగ్రవాదం పెను ముప్పుగా పరిణమించిందని, దీనిని ఎదుర్కొనేందుకు అందరం సమైక్యంగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందని మోదీ అన్నారు. ఆసియాన్%–%ఇండియా ట్రేడ్ ఇన్ గూడ్స్ అగ్రిమెంట్(ఏఐటీఐజీఏ)ను వీలైనంత త్వరగా సమీక్షించాలని మోదీ అభిలషించారు.

# జూబ్లీహిల్స్‌లో మీ నాటకాలు నడవవు..

## హరీశ్‌రావుపై ఎంపీ చామల కిరణ్ కుమార్ ఫైర్



**హైదరాబాద్,తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** ఎవరి గూబ గుయ్యి అంటుందో.. హరీశ్‌రావుకి తొందరలోనే తెలుస్తుందని, ఎన్నికలు వచ్చాయి అని ఆయన పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఉపఎన్నిక అంటే హరీశ్ రావుని ట్రబుల్ షూటర్ అని డబ్బా కొట్టేవాళ్ళు అని, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఎంత డబ్బు పెట్టారో ప్రజలందరికీ తెలుసు అన్నారు. జూబ్లీహిల్స్‌లో కూడా అదే చేద్దాం అనుకున్నారు కానీ, మీ నాటకాలు నడవవు అని ఫైర్ అయ్యారు. ఆదివారం చామల కిరణ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లక్ష ఇల్లు ఎక్కడ కట్టారు? ఎవరికిచ్చారు? హరీశ్ రావు చెప్పాలని, అధికారాన్ని చేతిలో పెట్టుకొని ఇష్టానుసారంగా నాళాలను చెరువులని కబ్జాలు చేశారని ఆరోపించారు.చిన్న వాన పడితే హైదరాబాద్‌లో తిరగలేని పరిస్థితి నెలకొన్నది, దానికి కారణం ఎవరు అని చామల ప్రశ్నించారు. నవీన్ యాదవ్ పేరు రాగానే బీఆర్ఎస్ ఇంకా గెలవదని తెలిసిపోయిందని, ఎవరు గూండాలు ఎవరు డబ్బులతో గెలవాలని చూస్తున్నారో వచ్చే నెల 11వ తారీఖు ప్రజలు నిర్ణయిస్తారని చామల కిరణ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు సెంటిమెంట్ మీద ఓట్లు సంపాదించుకోవాలని చూస్తున్నారని, ప్రజలు అమాయకులు కాదన్నారు. మీ పార్టీ భూస్థాపితం కావడం పక్క అని చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. హరీశ్‌రావు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నావు.. నువ్వు నీ బామ్మర్దికి ఎన్నికల ఫలితాలే చెంప చెల్లుమనేలా చేస్తాయని ఆయన అన్నారు.

# మొంథా వచ్చేస్తోంది!

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం

### నేటి ఉదయానికి తుపానుగా, రేపటికి తీవ్ర తుపానుగా రూపాంతరం

### 28 రాత్రి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం

### పలు జిల్లాలకు అత్యంత భారీ వర్షాల ముప్పు

విశాఖపట్నం: కోస్తా జిల్లాలపైకి 'మొంథా' తుపాను దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. అది ఆదివారం సాయంత్రానికి పోర్టుబ్లెయిర్‌కు 670 కిలోమీటర్లు, చెన్నైకు 720, కాకినాడకు 780, విశాఖపట్నానికి 790, గోపాలపూర్ (ఒడిశా)కు 900 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయంలోగా నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారి, అదే రోజు రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేసింది. మంగళవారం దాదాపు 12 గంటలపాటు దాని తీవ్రత కొనసాగి, తర్వాత తుపానుగా బలహీనపడొచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళ, బుధవారాల్లో గరిష్ఠంగా గంటకు 110 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు వీయొచ్చని చెప్పింది. తుపాను నేపథ్యంలో ఐఎండీ సోమవారం 7 జిల్లాలకు 'రెడ్' ఎలర్ట్, 16 జిల్లాలకు 'ఆరెంజ్', మరో 3 జిల్లాలకు 'ఎల్లో' ఎలర్ట్, మంగళవారం 14 జిల్లాలకు 'రెడ్', 8 జిల్లాలకు 'ఆరెంజ్', మరో 4 జిల్లాలకు 'ఎల్లో' ఎలర్ట్ జారీచేసింది.సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. విశాఖపట్నం, మచిలీపట్నం, కృష్ణపట్నం, నిజాంపట్నం, గంగవరం, కాకినాడ పోర్టుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగిస్తున్నారు. కళింగపట్నం, భీమునిపట్నం, వాడరేవు పోర్టులకూ సమాచారం అందించారు. తుపాను నేపథ్యంలో సహాయక చర్యల కోసం 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు జిల్లాల్లో ఉన్నాయని, మరికొన్ని బృందాలు హెడ్‌క్వార్టర్స్‌లో సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



కాకినాడలోని జగన్నాథపురం ఉప్పుటేరులో మత్స్యకారులు నిలిపిన పడవలు

# ఎర్రగూటికి ఓటమి - కాంకేరు, నారాయణపూర్

# అడవులనుంచి 70 మంది మావోలు ఆయుధాలతో లొంగుబాటు...



## అడవి మారింది... మావోలు మారుతున్నారు..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తెలుగు జనశక్తి అక్టోబర్ 26**

ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని కాంకేరు, నారాయణపూర్ జిల్లాల అబుజ్మాద్ అటవీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా భయానకంగా దాగి ఉన్న మావోయిస్టు బృందాలలో మరో పెద్ద విభాగం ఆయుధాలను వదిలిపెట్టే దిశగా నడుస్తోంది. సుమారు 70మంది మావోయిస్టులు తమ తుపాకులు, పేలుడు పదార్థాలతో పాటు పోలీసుల వద్ద లొంగుబాటు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని భద్రతా వర్గాల సమాచారం చెబుతోంది. ఇటీవల అబుజ్మద్ ప్రాంతంలో 208మంది మావోలు లొంగిపోగా, ఇప్పుడు ఈ కొత్త తరంగం ఆ దిశలో మరో కీలక దశగా కనిపిస్తోంది.

వివరణాత్మక కథనం:కాంకేరు-నారాయణపూర్ సరిహద్దు ప్రాంతంలోని మాద్, అబుజ్మాద్ అడవుల్లో గత కొద్ది రోజులుగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరిట కూంబింగ్ కార్యక్రమాలను తీవ్రతరం చేశాయి. ఈ దాడులు, నిఘా వర్గాల చురుకుదనం, మరియు పునరావాస పథకాల హామీలు కలిసి మావోయిస్టుల్లో పెద్ద ఎత్తున మార్పును తెచ్చాయి. వారం రోజులుగా భద్రతా వర్గాలకు లొంగుబాటుకు సంకేతాలు ఇస్తున్న 70మంది మావోలు ప్రస్తుతం కాంకేరు అడవి లోతుల్లో నుండి బయలుదేరి రావడానికి సన్నద్ధమవుతున్నారని సమాచారం.ఈ బృందంలో ఎక్కువ మంది పీఎల్జీఏ (పీపుల్స్ లిబరేషన్ గొరిల్లా ఆర్మీ) సభ్యులే కాగా, కొందరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. వీరిలో కొంతమంది సీనియర్ లీడర్లు గతంలో మడవి హిడ్మా ప్రభావానికి లోనై, ఉత్తర బస్తర్ ప్రాంతంలో కార్యకలాపాలు సాగించారని నిఘా వర్గాలు చెబుతున్నాయి ఈ లొంగుబాటు దళం వస్తుందని సమాచారం అందిన వెంటనే కాంకేరు పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పునరావాస పథకాలు, భద్రతా హామీలు ఇవ్వనుంది. ప్రభుత్వ వర్గాల ప్రకారం, మావోయిస్టుల లొంగుబాట్లతో బస్తర్ ప్రాంతంలో రెడ్ టెర్రర్ దశలవారీగా క్షీణిస్తోందని పేర్కొంటున్నారు. ఛత్తీస్గఢ్లో విజయవంతమైన కౌంటర్ ఇన్సర్జెన్సీ చర్యలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. 'ఆపరేషన్ కగార్' తర్వాత మావోయిస్టుల లోపల విభజన వేగం పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో సుక్మా, బీజాపూర్ ప్రాంతాల నుండి కూడా ఇలాంటి సమాధాన తరహా మార్పులు కనిపించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

# గరీబోడి భూమిపై రియల్ ముఠా డేగ కన్ను..

**ముచ్చర్ల ప్రభుత్వ భూములు కబ్జా.. కోట్ల రూపాయల విలువగల భూములకు ఎసరు.. భూ కబ్జాలకు పాల్పడుతున్న రియల్ వ్యాపారులు.. చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు..**



**మెదక్ జిల్లా ప్రతినిధి హత్నూర (తెలుగు జనశక్తి) అక్టోబర్ 26**

నిల్వ నీడలేని నిరుపేద కుటుంబానికి గత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ సాగు కోసం కొంత భూమిని కేటాయించింది. ఇప్పుడు ఆ భూమిపై కొంత మంది పెద్దల కన్ను పడింది. అ భూమికోసం అమాయకులను ఆసరగా చేసుకొని కోట్లు విలువ చేసే భూమిని కబ్జా చేయడానికి పథకం వేశారు. ఆ రైతునుండి కోట్లు విలువ చేసే భూమిని కొనుగోలు చేశారు. అసైన్డ్ భూములే లక్ష్యంగా పెట్టుకొని కొందరు రియల్ వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు ఈ దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ శివారులోని 98 సర్వే నంబర్ లోని భూమిని అప్పటి ప్రభుత్వం అసైన్డ్ భూమి అను వంశీకంగా వచ్చిన ఉట్ల బాలమణి కి 98/74/2 నెంబర్ గా కేటాయించింది. అదే భూమిలో వ్యవసాయం చేసుకుంటూ బతకాలని కేటాయించారు. ఈ భూమి మల్కాపూర్ నుండి పటాన్ చెరువు కు వెళ్ళే ప్రధాన రహదారికి అనుకొని ఉంది. ప్రస్తుతం అక్కడ ఎకరం భూమి రెండు నుండి మూడు కోట్ల వరకు మార్కెట్ ధర పలుకుతుంది. దీంతో కొన్ని రోజుల క్రితం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు చేతులు కలిపి కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములను కైవసం చేసుకొన్నారు. కాగ 98 సర్వే నంబర్ లోని 20 గుంటల భూమిలో ఇప్పటికే కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజాప్రతినిధులు కలసి బోరు వేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరంగా ఉంది. 98 సర్వే నంబర్ లో ఉన్న మరికొందరికి పాసు పుస్తకాలు ఉన్నా భూమి లేదు. ప్రస్తుతం పేదలకు ఇళ్లు కట్టుకోవడానికి కూడా స్థలాలు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మరి కొందరు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా వారికి కట్టుకోవడానికి స్థలం లేక ఇల్లు నిర్మించుకోలేక పోతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, కబ్జా కోరులకు మాత్రం కోట్ల రూపాయల విలువచేసే భూములు సునాయసంగా అందుతున్నాయి. మండల పరిధిలోని అనేక చోట్ల అసైన్డ్ భూముల మీద ప్రజా ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడిందంటే భూమి వారి హస్త గతంకావాల్సిందే. పేదల కోసం ఇచ్చిన భూములు వారి అవసరాలకోసం వారి దీన స్థితిని చూసి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ భూమికి కంచ వేసి కోట్ల రూపాయల కు అమ్మి వేస్తున్న సంఘటనలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు అమ్మినా కొన్నా చట్ట వేతిరేకమని తెలిసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్థానిక ప్రజా ప్రతినిధులు మానడం లేదని మండలంలో చర్చనీయాంశంగా మారింది. అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకొని ఈ దందా జోరుగా కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రోడ్లను మొరంతో గుంతలు పూడిక



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (తెలుగు జనశక్తి) అక్టోబర్ 26**

సిరికొండ మండలంలో గత కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొండాపూర్ ప్రధాన రోడ్డులలో మధ్య మధ్యలో గుంతలుగా ఏర్పడిన చోట కల్వర్టులు అనుకోని ఉన్న రోడ్డు తెగిన వద్ద ధ్వంసమైన విషయం తెలిసినదేగా ఈ రోడ్డును కొండాపూర్ స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రోడ్డుకు మొరం పోసి చదును చేయించడం జరిగింది. గ్రామంలోని ప్రధాన రహదారి మీద ఈ పనులను చేపట్టి, ప్రజలకు సౌకర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,యువకులు పాల్గొన్నారు.అలాగే గ్రామ అభివృద్ధి కమిటీ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

# పాము కాటుతో చిన్నారి మృతి



**రాజన్న సిరిసిల్ల జిల్లా/చందుర్తి (తెలుగు జనశక్తి) అక్టోబర్, 26**

చందుర్తి మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చేకుట రమేష్, సుమలత, కూతురు వేదాన్షి , ఏడాదిన్నర చిన్నారి పాముకాటుకు గురై మృతి చెందింది, స్థానికుల కథనం ప్రకారం చిన్నారి నిన్న రాత్రి 8:30 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా చిన్నారి గట్టిగా ఏడవడంతో పాప వద్దకు తల్లి వెళ్లి చూడగా ఏదో చీమలు కుట్టాయని అనుకుంది, కొంత సమయం తరువాత ఏదో విషపురుగు, కుట్టిందని నిర్ధారణ చేసుకొని వేములవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పాప కి పాము కాటు వేసిందని, పాప పరిస్థితి విషమంగా ఉన్నదని ఎల్లారెడ్డిపేటలో,ఉన్న ఆస్పత్రికి తరలించమని చెప్పారు, అంబులెన్సులో పాపని తీసుకుని వెళుతుండగా మార్గ మధ్యలో చనిపోయిందని నిర్ధారించిన వైద్యులు, పాప తండ్రి రమేష్, ఉపాధి నిమిత్తం గత ఆరు నెలల క్రిందట జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్ళాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు (తెలుగు జనశక్తి) అక్టోబర్ 26**

ఇల్లందు మండలంలో విస్తృతంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసి ముక్కి రంగు మారిన మొక్కజొన్నలను ప్రభుత్వమే మద్దతు ధర 2400 రూపాయలతో కొనుగోలు చేయాలని మధ్య దళారుల మోసాలను అరికట్టాలని తుఫాను వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు చంద్రా అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఆదివారము ఇల్లందు మండలంలోని మర్రిగూడెం పోలవరం కొమరారం మాణిక్యారం ముత్తారపు కట్ట రొంపేడు తదితర ప్రాంతాలలో పర్యటించి అధిక వర్షాలకు దెబ్బతిని మొలకెత్తి రంగు మారి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్ర అరుణ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట చివరి దశలో తుఫాను వల్ల దెబ్బ తినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఇంత జరిగినా ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు రైతుల గోడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని విస్తృతంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దెబ్బతిన్న మొక్కజొన్నతో పాటు అన్ని రకాల పంటలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రైవేటు వ్యాపారుల మోసాలు పెరిగిపోతాయని వారి మోసాలను అరికట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు, లేకపోతే అఖిలభారత ఐక్య రైతు సంఘం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అమరవీరుడు హెడ్కానిస్టేబుల్ పెంటయ్య కుటుంబాన్ని పరామర్శించిన అదనపు ఎస్పీ..





**మెదక్ జిల్లా ప్రతినిధి (తెలుగు జనశక్తి) అక్టోబర్ 26**

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అమరవీరుడు హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య కుటుంబాన్ని పరామర్శించిన అదనపు ఎస్పీ సి.ఎస్. మహేందర్. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం మెదక్ టౌన్లో పోలీస్ అమరవీరుడు ఎస్బి హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య కుటుంబాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరామర్శిం చారు. ఈ సందర్భంగా మహేందర్ ముందుగా అమరవీరుడు పెంటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారి ఆరోగ్యం, జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పోలీసులు ఎల్లప్పుడూ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. 1997 నవంబర్ 17వ తేదీన నక్సలైట్ల కదలికలపై సమాచారం అందుకొని విధి నిర్వహణలో బయలుదేరిన సందర్భంలో శివంపేట్ మండలం లోని పిలుట్ల వద్ద జరిగిన బాంబు దాడిలో అప్పటి తూప్రాన్ డియస్పి యం. బాల సుబ్రహ్మణ్యం, తూప్రాన్ సీఐ వై. వెంకటస్వామి, ఎస్బి హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, శివంపేట్ కానిస్టేబుల్ లు లక్ష్మ నాయక్, శ్రీనివాస్ రావు, సుజాయత్ అలీ లు ఆ దాడిలో వీరమరణం పొందారు. విధి పట్ల కట్టుబాటుతో ప్రాణత్యాగం చేసిన వారి సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాన్ని స్మరించుకుంటూ, జిల్లా పోలీసులు ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అమరవీరుల కుటుంబాలను పరామర్శించడం ద్వారా వారి సేవలను గుర్తుచేసుకుంటారని తెలిపారు. మీరు కూడా మా పోలీస్ కుటుంబంలో భాగమే. ఎలాంటి సమస్యలైనా నిరభ్యంతరంగా పోలీస్ అధికారులను సంప్రదించాలని వారి కుటుంబ సభ్యులను తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి డి. ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీగోదా శ్రీకృష్ణ నూతన మందిర ప్రతిష్టాపన మహాకుంబ సాంప్రోక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న భూక్యా జాన్సన్ నాయక్



**మంచిర్యాల జిల్లా ఖానాపూర్ ఆర్సి తెలుగు జనశక్తి అక్టోబర్ 26:**

బిఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ లో ఆదివారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ లో నిర్వహించిన నూతన మందిర ప్రతిష్టాపన మహాకుంబ సంప్రోక్షణ శుభ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ భూక్యా జాన్సన్ నాయక్ శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆశీస్సులు జాన్సన్ నాయక్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుంది...

**ప్రజల ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా చర్లలో బిఆర్ఎస్ శక్తి ప్రదర్శన**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తెలుగు జనశక్తి అక్టోబర్ 26**

చర్లలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసే కార్యక్రమం ఈరోజు రాజకీయ వాతావరణాన్ని కదిలించింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్టీ కేంద్ర నాయకత్వం సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశానుసారం మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.దొడ్డి తాతారావు మాట్లాడుతూ"తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్పై ఉంచిన నమ్మకం తిరిగి బలపడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు విఫలమయ్యాయి, ఇప్పుడు ప్రజలు వారి వాస్తవ రూపాన్ని గుర్తిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురుతుంది," అని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు కాగితాలపైనే మిగిలిపోయాయని ఆయన తీవ్రంగా విమర్శించారు.పార్టీ నేతల ప్రకారం, గ్రామస్థాయిలో పారిశుధ్యం, మౌలిక వసతుల లోపం, పనుల నిలిచిపోవడం ప్రజల అసంతృప్తిని పెంచాయని, ఈ సారి బిఆర్ఎస్ తిరిగి ప్రజల మనసులు గెలుచుకోనుందంటూ నమ్మకం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు, సయ్యద్ అజీజ్, దినసరపు భాస్కర్ రెడ్డి, అంకాల శ్రీనివాసరావు, గోరింట్ల వెంకటేశ్వరరావు, రాట్నాల శ్రీరామ్మూర్తి, ఎడ్ల రాందాస్, సాంబశివరావు, ఆర్.ఎం.పి. రాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# జనశక్తిగా మారుదాం.. విప్లవాన్ని నిలబెట్టుదాం..

**శతజయంతి పండుగలో చర్ల ప్రతిధ్వని సిపిఐ కల్లూరి వెంకటేశ్వరరావు... చర్ల మండల ఆర్గనైజర్గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డా ఎస్.కె జాకీర్ హుస్సేన్..**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తెలుగు జనశక్తి అక్టోబర్ 26**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ప్రచార కార్యక్రమాలు చర్ల మండలంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ తరఫున విరాళాల సేకరణ ప్రారంభమైంది. సిపిఐ శతజయంతి ముగింపు బహిరంగసభను డిసెంబరు 26న ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు.చర్లలో ఇంటింటికీ సిపిఐ కార్యకర్తలు ప్రచారం సాగిస్తూ పార్టీ శతాబ్ది చరిత్రను వివరిస్తూ ప్రజల నుండి విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, "సిపిఐ పార్టీ భారత రాజకీయ వ్యవస్థలో శతాబ్ద కాలంగా కార్మిక రైతు హక్కుల కోసం సాగించిన పోరాటం నేటికీ ప్రేరణాత్మకంగా నిలుస్తుంది" అన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా చర్ల ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు ఎస్కే జాకీర్ హుస్సేన్ను ఏకగ్రీవంగా సిపిఐ చర్ల మండల ఆర్గనైజర్గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ బలోపేతం కోసం ప్రజల్లో మరింత చైతన్యం కలిగించే దిశగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూప పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు నూప తిరుపతిరావు, పాలంచరామారావు, కోడి రెక్కల రాజారావు, మోట్ల రాజు, నూప రాము, కుసం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో పార్టీ పట్ల ఉత్సాహం పెరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. శతజయంతి ఉత్సవాల భాగంగా మరిన్ని కార్యక్రమాలను గ్రామ స్థాయిలో కొనసాగించాలని నిర్ణయించారు.

# వైఎన్ఎస్ ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్ని ప్రారంభమించిన కోలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్ (తెలుగు జనశక్తి) అక్టోబర్ 26**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చి గాగిలాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు థామస్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసుకున్న వై. ఎన్.ఎస్. ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్ ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభమించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి మరియు డా.లక్ష్మ నాయుడు.ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవ రెడ్డి, అమరం ముత్యం రెడ్డ్, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు నవీన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్,బల్ రాజ్, ఎం డి నయీమ్ పాషా ఏరువ సుధీర్ రెడ్డి,ఏరువ నవీన్ రెడ్డి వై థామస్ రెడ్డి వై రాజా రెడ్డి,ఏరువ శ్రీకర్ రెడ్డి,వై స్లీవ రెడ్డి,వై ప్రదీప్ రెడ్డి జి విజయ్ భాస్కర్ రెడ్డి వై సుజిత్,జి ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ జోరు





**కామారెడ్డి జిల్లా గాంధారి తెలుగు జనశక్తి అక్టోబర్ 26**

గాంధారి మండల కేంద్రంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటగా ఆయన ఇందిరమ్మ మోడల్ హౌస్ను ప్రారంభిం చారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ గాంధారి పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన కొత్త మరుగుదొడ్లను ప్రారంభించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తమ సొంత నిధులతో రూ.9 లక్షలు కేటాయించారు. అదే పాఠశాలలో ఆగ్మెంటెడ్, వర్చువల్ రియాలిటీ ల్యాబ్, అలాగే కొత్త కంప్యూటర్ ల్యాబ్ను కూడా ప్రారంభించారు. ఈ ల్యాబ్ల ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్యలో మరింత అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. తరువాత రూ.12 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనానికి భూమి పూజలి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకాంగ్రెస్ మరియు మహిళా కాంగ్రెస్ నాయకులు, వివిధ ప్రజా ప్రతిని ధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ "విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధి పట్ల మన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అని పేర్కొన్నారు.

# 5లక్షల 40,000వేల రూపాయల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**మంచిర్యాల జిల్లా ఖానాపూర్ ఆర్సి తెలుగు జనశక్తి అక్టోబర్ 26:**
ఖానాపూర్ నియోజకవర్గం కడెం:- మండలం లోని కొత్త మద్దిపడిగె గ్రామానికి చెందిన చిప్ప లింగవ్వ. భర్త రాజన్న. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నడు వైద్యం నిమిత్తం అయిదు లక్షల నలభై వేల రూపాయల చెక్కుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుటుంబ బాధితులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలని అన్ని రకాలుగా ఆదుకోవడానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడు తోడుగా ఉంటుంది అన్నారు...!

# రక్త దానం ప్రాణ దానంతో సమానం: ఏనుగు సుదర్శన్ రెడ్డి

**ఘట్కేసర్‌లో సెయింట్ ఆంటోనీస్ ఫౌండేషన్ రక్తదాన శిబిరం**
**సంస్థ సేవలను కొనియాడిన బీజేపీ ఇంచార్జ్**



**మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ తెలుగు జనశక్తి అక్టోబర్ 26**
ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ ఆంటోనీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ఇది అత్యంత శక్తివంతమైన దానమని కొనియాడారు.

సుదర్శన్ రెడ్డి ప్రసంగం



సమాజానికి తోడ్పాటుగా దానం చేయడం గొప్ప లక్షణమని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి తెలిపారు. అన్ని దానాల్లోకెల్లా ప్రాణాలు కాపాడే శక్తి రక్తదానానికి మాత్రమే ఉందని ఆయన అన్నారు. అనేక సంవత్సరాలుగా సమాజానికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సెయింట్ ఆంటోనీస్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జాంగిర్, పెద్దలు, యువత, పలువురు దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. సంస్థ నిర్వాహకులు రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాన్సువాడలో పోచారం అనుచరుల నాటకాలు
# బీఆర్ఎస్ నాయకుల విమర్శలు



**కామారెడ్డి జిల్లా బాన్సువాడ తెలుగు జనశక్తి అక్టోబర్ 26**
బాన్సువాడ నియోజకవర్గ ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు ప్రతిరోజూ మీడియా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజానీకాన్ని గందరగోళానికి గురి చేస్తున్నారని బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఆదివారం సమావేశమై మాట్లాడారు. వారు మాట్లాడుతూ %-% "పోచారం శ్రీనివాస్ రెడ్డి అనుచరగానం మీడియా మిత్రులను అగౌరవపరుస్తూ నాటకాలు ఆడుతోంది. తాము ఏ పార్టీలో ఉన్నామో వారికే తెలియని పరిస్థితి నెలకొంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్‌పై గెలిచి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేవలం మూడు నెలల్లోనే కాంగ్రెస్‌లో చేరి వ్యవసాయ సలహాదారునిగా నామినేట్ పదవి స్వీకరించిన పోచారం, తనకోసం కష్టపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తలను మోసం చేశాడు" అని విమర్శించారు. అలాగే, "మా సారు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని చెప్పే రెండవశ్రేణి నాయకులు వాస్తవానికి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజాయితీ, ధైర్యం ఉంటే తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రమాణం చేసి 'నేను కాంగ్రెస్ పార్టీలో చేరలేదు' అని పోచారం స్వయంగా చెప్పాలని సవాలు విసురుతున్నాము" అని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తీసుకొచ్చిన నిధుల వివరాలు ప్రజలకు చెప్పే ధైర్యం ఆయనకు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొచి గణేష్, టిఆర్ఎస్వి మాజీ కార్యదర్శి ఎర్రవటి సాయి బాబా, గాండ్ల కృష్ణ, మొగులయ్య, రమేష్ యాదవ్, చాకలి మహేష్, చాకలి సాయిలు, లక్ష్మణ్, ఇషాక్, నగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**కామారెడ్డి జిల్లా, నిజాంసాగర్ (తెలుగు జనశక్తి), అక్టోబర్ 26:**
నిజాంసాగర్ మండలంలోని ఆరెడు గ్రామానికి చెందిన గాండ్ల బసప్ప అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన దుర్ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బసప్ప ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తన వ్యవసాయ బోరు మోటారును తనిఖీ చేయడానికి నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ వెల్లడించారు.

## స్థానిక ఎన్నికల్లో
# బిజేపి విజయ దిశగా జన్నారం మండల కేంద్రం

**బిజేపి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. ప్రతి ఒక్క బిజేపీ కార్యకర్త బరిలో నిలవాలి**



**మంచిర్యాల జిల్లా ఖానాపూర్ ఆర్సి తెలుగు జనశక్తి అక్టోబర్ 26:**
జన్నారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మొదటిసారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులైన సందర్భంగా జన్నారం మండల కేంద్రంలో ఆదివారం విచ్చేసిన రఘునాథ్ కి ఘన స్వాగతం పలికారు మండల బిజెపి శ్రేణులు.జన్నారం పొనకల్ బస్టాండ్ పరిధి నుంచి జ్యోతి గార్డెన్ వరకు భారీ సంఖ్యలో ర్యాలీగా వెళ్లారు.అనంతరం జ్యోతి గార్డెన్లో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథులుగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్,మంచిర్యాల మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్,సీనియర్ నాయకులు ముకేష్ గౌడ్ హాజరవడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి పెద్దలు మాట్లాడుతూ కుటుంబ పాలన అలాగే మన రాష్ట్రంలో ఉన్న పార్టీలు కూడా ఇప్పుడు ఏదైతే ఉందో కుటుంబం ఎవరైతే భారతీయ జనతా పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుంది. భాజపా రాష్ట్ర ఉపాధ్యాయులు వేరవెల్లి రఘునాథ్ ఎంతో ఉన్నత స్థితిలో ఉండి అమెరికాలో మంచి లైఫ్ గడుపుతున్న తరుణంలో ఆయన అన్ని వదిలేసి నేను నా పుట్టిన దేశం కోసం నేను ఏదైనా సేవ చేయాలి,నేను ఇక్కడ ఉంటే నా ఒక్కడినే నేను సంపాదించుకొని నా భార్య పిల్లలు నా కుటుంబం హాయిగా ఉంటది కానీ నన్ను ఇప్పుడు కన్నా నా మాతృ భూమికి నా వంతుగా కృషి చేయాలని అక్కడ లక్షలాది రూపాయలు ఆయన ఉద్యోగాన్ని వదిలేసి మంచిర్యాలకు వచ్చేసి కష్టపడి ఈ యొక్క స్థానానికి వచ్చారంటే ఆయన ఎంత కష్టపడ్డాడో మనందరం అర్థం చేసుకోవాలి..2000 ఓట్లు మూడువేల ఓట్ల నుంచి మొదలైన ప్రస్థానం ముందు మనం చూస్తే 60 వేల దాకా పోయింది.అంటే వారి కృషి ఎంత ఉందో చూసుకోవాలి రఘునాథ్ ఈరోజు భారతీయ జనతా పార్టీకి ఓటర్లు చాలా అనుకూలంగా ఉన్నారు కానీ మనం ఆ ఓటర్లను మలుచుకునే విధానం మన పైన ఉంది.మనందరం చాలా కష్టపడాలి మీరు ఎవరు నాయకులు చాలామంది ఇప్పటివరకు మనం అధికారంలోకి రాలేదు ఎందుకంటే చాలా కష్టపడుతున్నారనీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు...

**రాష్ట్ర ఉపాధ్యక్షులు వేరవెల్లి రఘునాథ్...**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే నంబర్ వన్ లీడర్ గా ఉన్న మన ప్రియతమ నాయకులు రాథోడ్ రమేష్. గత సంవత్సరము వారు మరణించిన విషయం మనకు అందరికీ తెలుసు ముందు రాథోడ్ రమేష్. కి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ. ఈ ప్రాంతంలో ఎప్పుడు వచ్చినా కూడా జన్నారం మంచిర్యాల జిల్లాలోనే ఉండే మొన్నటివరకు సంస్థాగతంగా కూడా మంచిర్యాల జిల్లాలోనే ఉండే మేము ఈ ప్రాంతంలో ఎప్పుడు వచ్చినా జన్నారం వస్తున్నాం అంటే మొట్టమొదట ఫోన్ చేసేదే రాథోడ్ రమేష్.కు ఫోన్ చేసి రమేష్ అన్న జన్నారంకు వస్తున్నము అని ఆయన్ని స్మరించుకున్నారు.దాదాపు ఒక మూడు సంవత్సరాలు వారితోటి కలిసి అనేక కార్యక్రమాల్లో ఈ జన్నారం ప్రాంతంలో పాల్గొంటుంటే వారిని. గుర్తుతెచ్చుకుంటాం.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన జన్నారం మండల బిజెపి కార్యకర్తలు అందరికి కూడా పేరుపేరునా ధన్యవాదాలు. ఎందుకంటే ఈజీ కాదు ఈ కార్యక్రమం చేయడం.ఆదివారం నాడు పెళ్లిళ్లు ఉన్న రోజులు మండల అధ్యక్షులు మధు, శంకరయ్య ఇక్కడ ఉన్న కార్యకర్తలందరూ ఇక్కడికి వచ్చిన ప్రతి గ్రామం నుంచి వచ్చిన కార్యకర్తలకు అందరికి కూడా మీరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఒక మంచి ఈ కార్యక్రమం తోటి అనిపించింది రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో జడ్పిటిసి కచ్చితంగా భారతీయ జనతా పార్టీ గెలుస్తుందని నమ్మకం తనకు ఉందని తెలిపారు.ఎందుకంటే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రజలందరూ కూడా ఈ మండలంలో భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇస్తారని చాలా భరోసా తనకున్నదని అన్నారు.ఎన్నికల్లో తొందరలోనే ఉంటాయి కూడా చట్టం తీసుకొచ్చారు ఇవన్నీ చూస్తుంటే నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ వస్తుందని,నవంబర్ చివరికి ఎంపిటిసి ఎన్నికలు ఉంటాయి ఒక పది రోజుల గ్యాప్ తోటి సర్పంచ్ ఎన్నికలు మున్సిపల్ ఎన్నికలు కూడా పెట్టేస్తారు ఈ ప్రభుత్వం రెడీ అయింది కనుక మనమందరం కూడా బిజెపి కార్యకర్తలు చెప్పండి ఎంపిటిసి, జెడ్పిటిసి సర్పంచులు ప్రతిదీ పోటీ చేయాలి. ప్రజలందరూ కూడా ఇక్కడ ఈ జన్నారంలో మనం ఎమ్మెల్యే ఎన్నికల్లో కూడా వాతావరణం ఖానాపూర్ అసెంబ్లీల మంచి వాతావరణం ఉండదు. మార్పు అందరు కోరుకుంటున్నారు.ఎమ్మెల్యే చేయాలన్న ఈ ప్రాంతం నుంచి అందరూ గెలవాలన్నా ముఖ్యంగా తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలి అంటే, స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుస్తేనే మన భాజపా అధికారం లోకి వస్తుంది కనుక స్థానిక సంస్థ ఎన్నికలు గెలవడం చాలా ముఖ్యం.ఎక్కడ ప్రచారంలో తిరగమంటే తిరుగుతారు.కానీ మీరందరూ కూడా అభ్యర్థులు ఎవరి కొరకు వెయిట్ చేయకూడదు ఎందుకంటే సమయం ఎక్కువ ఉండదు.ఒకసారి నోటిఫికేషన్ వచ్చినంక మొన్న మీరు షెడ్యూల్ చూసి నామినేషన్ చూడండికనుక అందరు పోటీ చేయాల్సిందే ప్రతి ఒక్కరు పోటీ చేయాల్సిందే స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలవాల్సిందే అని అన్నారు. ఈరోజు ఈ సన్మాన కార్యక్రమం నాకు కాదు గుర్తింపు ఈ సన్మాన కార్యక్రమం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత 40 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ప్రతి బీజేపీ కార్యకర్తయి ఎందుకంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మనం నాలుగు ఎమ్మెల్యేలు గెలవడం ఎంపీ గెలవడం కొన్ని నియోజకవర్గాలలో కొన్ని ఓట్లతోటే ఓడిపోవడం ఇవన్నీ కూడా పార్టీ గుర్తించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలందరూ కూడా బిజెపి వైపు చూస్తున్నారు. అక్కడ కార్యకర్తలు అందరూ కూడా చాలా కష్టపడుతూ కార్యకర్తలు అందరు కూడా బాగా పనిచేస్తుందని పార్టీ గుర్తించి ఈ రోజు నాకు ఈ బాధ్యత ఇచ్చింది ఇది నాకు ఇచ్చిన బాధ్యత వచ్చిందంటే దానికి కారణము ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న బిజెపి కార్యకర్తలే కారణం ఎందుకంటే ఎన్నో సంవత్సరాల నుంచి చాలామంది సీనియర్ కార్యకర్తలు పార్టీని గెలిపించాలని ఎన్నో సంవత్సరాల నుంచి గిరిజన ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాలలో కార్యకర్తలు గుర్తింపుగా భావిస్తున్నాను ఇంతకు ముందు రితేష్. చెప్పినట్టు రాష్ట్ర పార్టీకి ఇక్కడి నుంచి ఏ సమస్య ఉన్న ఇక్కడ సమస్యల మీద కావచ్చు ప్రతి విషయాన్ని రాష్ట్ర పార్టీకి తీసుకుపోయే బాధ్యత నాదని భరోసా ఇచ్చారు.మీకు పూర్తిగా అండగా ఉంటాము.రెవెన్యూ జిల్లా పరంగా ఇది మంచిర్యాల జిల్లాలకు వస్తది రెవెన్యూ పరంగా ఏదైనా పోలీస్ సమస్యలున్న డిసిపి,ఏసిపి కలెక్టర్ ఆఫీస్ కి సంబంధించిన ఏ అవసరాలు ఉన్నా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకన్న మీకు అందరికీ అండగా ఉంటారు.మేమందరం మీకు అండగా ఉండటామని,రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో కాషాయ జెండా ఎగరేసే లక్ష్యంగా పెట్టుకోవలని ఆయన అన్నారు.





**పాల్వాయి హరీష్ మాట్లాడుతూ...**
కార్యక్రమాలన్నీ వదిలేసి పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. రెండు మూడు రోజుల క్రితం సెక్రెటరీ ఫైనల్ డిపార్ట్మెంట్ పని ఉంటే లిఫ్ట్ వెళ్తా ఉంటే ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే మాట్లాడుతూ. మీ నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంది అని అడిగితే మేము ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచామా కూడా మాకు గ్రూప్ పోయినా బాగుండు అని ఆలోచనలో ఉన్నామని వారన్నారని ఆయన తెలిపారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పోటీ చేయాలని కొంతమంది ఇబ్బంది అవుతుంది పోటీ చేయడానికి వెనుక ముందు ఆలోచిస్తుంటారు కానీ మీరు నాయకులుగా ఎదగడానికి ఒక మంచి స్థానం ఏర్పాటు అవుతుందని అన్నారు. ఆర్మూర్ నుంచి మంజూరు చేసినట్లే నేను అసెంబ్లీలో చాలా సందర్భాల్లో మాట్లాడిన మీరందరూ మనకు ఆశీర్వాదం నుంచి లేకపోతే మంచిర్యాల వరకు జాతీయ రహదారి ఎందుకని మంజుల హైదరాబాద్ పోవడానికి మూడున్నర నాలుగు గంటలకు సమయం పడుతుంది అని లేవని తిను కేంద్ర మంత్రి వచ్చినప్పుడు కూడా ఇక్కడి భాజపా కార్యకర్తలు రావడం జరిగింది. నవంబర్ 5 రోజు నామినేషన్ సేకరించి నిరాకలలోపు పూర్తిగా సర్పంచ్ ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది కాబట్టి భాజపా కార్యకర్తలు అందరూ నాయకులు ప్రతి ఒక్కరూ పోటీలో నిలవడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు.

సమావేశ అనంతరం మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో అన్ని మండలాల అధ్యక్షులు ఎస్టి మోర్చా ఎస్సీ మోర్చా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వేరవెల్లి రఘునాథ్. ని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జన్నారం మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, జిల్లా నాయకులు కొంతం శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శిలు రమేష్ గౌడ్, జగన్, దేవేందర్, రాష్ట్ర నాయకులు పవన్, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు బద్రి నాయక్,ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు బోడ తిరుపతి, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద్, బీజేవైఎం మండల అధ్యక్షులు రమేష్, కడెం, దస్తురాబాద్, ఖానాపూర్ రూరల్. ఆయా మండలాల అధ్యక్షులు జన్నారం మండల బిజెపి కార్యకర్తలు మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శాంతినికేతన్ స్కూల్‌లో కీచక ప్రిన్సిపాల్ 8వ తరగతి బాలికపై అసభ్య ప్రవర్తన

**'స్పెషల్ క్లాసుల' పేరుతో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సాయిబాబాబీ కేసు నమోదు చేసి గాలిస్తున్న కీసర పోలీసులు**




**మేడ్చల్ జిల్లా కీసర తెలుగు జనశక్తి అక్టోబర్ 26**
మేడ్చల్ జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధి, నాగారం వెస్ట్ గాంధీ నగర్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. స్కూల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న సాయిబాబా, ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలిక పట్ల అసభ్యకరం గా ప్రవర్తించినట్లు ఆరోపణలు రావడంతో తీవ్ర కలకలం రేగింది.

**'స్పెషల్ క్లాసుల' ముసుగులో దారుణం**
ప్రిన్సిపాల్ సాయిబాబా 'స్పెషల్ క్లాసులు' పేరుతో బాలికను ఒంటరిగా పిలిచి, ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వేధింపుల గురించి బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో ఈ ఘటన వెలుగు లోకి వచ్చింది.

**పోక్సో చట్టం కింద కేసు నమోదు**
బాధితురాలి తల్లిదండ్రులు వెంటనే కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్ బాలిక పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్ సాయిబాబాపై పోలీసులు లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.ఘటన జరిగిన వెంటనే నిందితుడైన ప్రిన్సిపాల్ సాయిబాబా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని త్వరగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు కీసర పోలీసులు వెల్లడించారు. ఈ కీచక ఘటనపై విద్యార్థి సంఘాలు, బాలల హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

# కాకినాడ జిల్లాలో భారీ వానలు

**ఆంధ్రప్రదేశ్:** మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భయపెడుతోంది. ఇది తీవ్ర తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరంపై విరుచుకుపడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అక్టోబర్ 28వ తేదీ అర్ధరాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. లఈ ఏడాదిలో ఇదే అతిపెద్ద తుపాను అనే అంచనాతో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపడుతోంది. ఇందులో భాగంగా పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో ఐదు రోజుల పాటు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. కోస్తా జిల్లాలు అన్నింటిపైనా తుపాను ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా కాకినాడ సమీపంలో తీరం దాటనున్న నేపథ్యంలో.. ఆ జిల్లాపై అత్యధిక ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కాకినాడ జిల్లాలో ఏకంగా ఐదు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 27 నుంచి అక్టోబర్31 వరకు అంటే.. సోమవారం నుంచి శుక్రవారం వరకూ కాకినాడ జిల్లాలో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.



# 19వ మృతదేహం ఎవరిదో తేలింది..

**కర్నూలు:** వేమూరి కావేరీ బస్సు ప్రమాద ఘటనలో 19వ మృతదేహం ఎవరిదనే సస్పెన్స్ వీడింది. శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. అయితే మృతుల్లో 18 మందిని గుర్తించిన అధికారులకు .. ఓ మృతదేహం ఎవరిదనే వివరాలు మాత్రం తెలియరాలేదు. రిజర్వేషన్ ఆధారంగా మిగిలినవారి వివరాలు తెలుసుకున్న పోలీసులు.. సదరు వ్యక్తి రిజర్వేషన్ చేయకుండా బస్సు ఎక్కటంతో వివరాలు తెలుసుకోవటం కష్టంగా మారింది. ఈ క్రమంలోనే తాజాగా ఆ మృతదేహం ఎవరిదనే సస్పెన్స్‌కు తెరపడింది. ఆ 19వ మృతదేహం చిత్తూరు జిల్లాకు చెందిన త్రిమూర్తి అనే వ్యక్తిదిగా పోలీసులు గుర్తించారు. డీఎన్ఏ టెస్టు ద్వారా ఈ విషయాన్ని గుర్తించారు. చిత్తూరుకు చెందిన త్రిమూర్తి హైదరాబాద్ వచ్చారని.. అయితే రిజర్వేషన్ లేకుండానే ఆయన ఆరంఘర్ సర్కిల్ వద్ద వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు ఎక్కినట్లు తెలిసింది. అయితే హైదరాబాద్ వెళ్లిన త్రిమూర్తి.. ఇంటికి తిరిగి చేరుకోకపోవటంతో ఆయన కుటుంబ సభ్యులు.. ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేశారు. అయితే ఎలాంటి ఫలితం లేకపోయింది. త్రిమూర్తి అందుబాటులోకి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన త్రిమూర్తి కుటుంబ సభ్యులు కర్నూలుకు చేరుకున్నారు. బస్సు ప్రమాదం నేపథ్యంలో త్రిమూర్తి అందుబాటులోకి రావటం లేదంటూ పోలీసులను సంప్రదించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని మృతదేహానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించిన అధికారులు.. ఆ మృతదేహం త్రిమూర్తిదేనని గుర్తించారు. దీంతో మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తి అయ్యింది.

మరోవైపు కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో ఆదివారం కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. బైకర్ శివశంకర్ , అతని స్నేహితుడు ఎర్రిస్వామి గురువారం సాయంత్రం మద్యం సేవించినట్లు తెలిసింది. చిన్న టేకూరు వద్దనున్న వైన్స్ షాపులో.. గురువారం సాయంత్రం ఏడు గంటలు, అలాగే ఎనిమిదిన్నర ప్రాంతంలో రెండుసార్లు మద్యం కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే బస్సు ప్రమాదం శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మరోవైపు కర్నూలు బస్సు ప్రమాదానికి సంబంధించిన అనాలసిస్ రిపోర్టును కర్నూలు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం చనిపోయిన బైకర్ శివశంకర్ నుంచి సేకరించిన నమూనాల్లో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని. దీంతో శివశంకర్ మద్యం తాగి బైక్ నడిపినట్టు శాస్త్రీయంగా కూడా రుజువైంది.

# కొత్తగట్లలో ఎర్రజ్వాలలు

సిపిఐ శతాబ్ది వేడుకల పిలుపుతో రగిలిపోయిన ప్రజా చైతన్యం!





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తెలుగు జనశక్తి అక్టోబర్ 26**

చర్ల మండలంలో కొత్తగట్లు గ్రామం ఎర్ర ఎగసింది. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే సిపిఐ శతాబ్ధ మహా సభకు ఊరెత్తి మద్దతు తెలపాలని ప్రజలు సంకల్పించారు. ప్రతి వీధి ఎర్ర జెండాలతో, నినాదాలతో ఆందోళన తరంగంలా మిన్నంటింది. ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తూ పార్టీ నాయకత్వం ప్రజల్లో గెలుపు నినాదం అల్లింది. "ఒక్కో రూపాయి %–% సమాన సమాజం మా హక్కు!" అని పిలుపునిచ్చిన ఆవాజ్ గల్లీ నుండి గ్రామ చౌరస్తా వరకు మార్మోగింది. "పోరాడేది పేదరికం %–% నిలిచేది ఎర్రపతాక!" అంటూ యువత నడకలో అడుగులు బిగించి సాగింది. ఈ చైతన్య పర్వానికి కోడి రెక్కల రాజారావు (మాజీ ఎంపిటిసి), పోడియం ఆదిలక్ష్మి, కట్టం నాగేశ్వరరావు, పోడియం స్వప్న, రాంబాబు, వీరన్న, భద్రమ్మ, కోట శంకర్, లక్ష్మి, ప్రసాద్, పోడియం నాగమ్మ, కల్లూరి సమ్మక్క, సారమ్మ, చిన్న వెంకటి తదితరులు నేతృత్వం వహించారు. ఎర్ర జెండాలు గాలిలో పటాసులా ఎగురుతుండగా, ప్రజల కళ్ళలో ఆశా కాంతులు మెరిశాయి. "సమానత్వం %–% మన హక్కు, మన భవిష్యత్తు!" "శతాబ్ధ సిపిఐ జెండా కింద గెలుపు మనదే!" అంటూ ప్రజలు గర్జించారు. పల్లెల్లో పిల్లలు పాటలు పాడగా, మహిళలు ఎర్ర దుపట్టాలతో విజయ గీతాలు ఆలపించారు. కొత్తగట్ల ఆకాశమంతా పోరాట జ్వాలలతో రగిలిపోయింది. నాయకులు మాట్లాడుతు ు "శతాబ్ధ సిపిఐ కేవలం పార్టీ కాదు, అది ప్రజా హక్కుల చరిత్ర! ఖమ్మం సభలో ఆ చరిత్రను మళ్లీ వెలిగిద్దాం!" అని ఉత్సాహభరిత పిలుపునిచ్చారు. ఇక కొత్తగట్లు మాత్రమే కాదు, మొత్తం ప్రాంతం ఎర్ర పతాక పాదయాత్రకు రంగం సిద్ధమవుతోంది.

## కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత, వేగం అవసరం: ఎన్ఫోర్స్మెంట్ సూచనలు



**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఆర్సి (తెలుగు జనశక్తి )అక్టోబర్ 26:** ఎన్ఫోర్స్మెంట్ డీటీ బృందం ఆదివారం ఎల్లారెడ్డి పిఎసిఎస్ పరిధిలోని పి.పి.సి. కేంద్రాలను సందర్శించింది. గండి, మాసానిపేట్, శివనగర్ మరియు బిక్కునూరు కేంద్రాలలో కొనుగోలు కార్యక్రమం ప్రగతిని పరిశీలించిన అధికారులు, కొనుగోలు వేగవంతం చేయాలని, తేమ శాతం 17% శాతం మించకూడదని, రైస్ మిల్లులకు ధాన్యం తక్షణం చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా కొనుగోలు కొనసాగించాలని సూచించిన అధికారులు, కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విశ్వనాథం, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ విప్ర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు అందుకున్న బెల్లంపల్లి విద్యార్థులు




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (తెలుగు జనశక్తి)అక్టోబర్ 26:** ఆదివారం, హైదరాబాద్‌లో విప్ర్ ఫౌండేషన్ జోన్ 16 తెలంగాణా ఆధ్వర్యంలో కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియం, లక్డీ కా పూల్ లో ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా మరియు బి.టెక్ విభాగాల్లో 90% పైగా మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రతిభా అవార్డులతో సత్కరించారు.

**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి విద్యార్థుల కీర్తి:** వశిష్ట్ పాండే– బి.టెక్ 1వ సంవత్సరం, 9.88 జీపీఏ ప్రథమ్ పాండే – ఇంటర్మీడియట్, తెలంగాణా సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, షేక్ పేట్, 99% మార్కులుఛవి శర్మ – ఇంటర్మీడియట్, 90 GPAఈ కార్యక్రమంలో జోన్ 16 విప్ర్ ఫౌండేషన్ అధ్యక్షుడు హరికిషన్ ఓజా, మంత్రి రామ్‌దేవ్ నాగ్లా, కోఆర్డినేటర్ ఆనంద్ శర్మ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పోచారం అన్ననగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహ

# ప్రతిష్టాపన మహోత్సవం

## నూతన ఆలయ నిర్మాణంలో పలువురు దాతల సహకారం

### ఘనంగా పాల్గొన్న మాజీ కౌన్సిలర్లు, నాయకులు







**మేడ్చల్ జిల్లా పోచారం తెలుగు జనశక్తి అక్టోబర్ 26 :** పోచారం అన్ననగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ మరియు శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం వేద పండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవం గా జరిగింది. కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు అందుకున్నారు.

**దాతల సహకారం అభినందనీయం**

ఈ ఆలయ నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించిన దాతలను ఈ సందర్భంగా సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలు:

- మాజీ వార్డ్ కౌన్సిలర్ సామల శ్రీలత బుచ్చిరెడ్డి
- సామల సందీప్ రెడ్డి
- సరిత చెరుకు బద్రీనారాయణ గౌడ్

**విగ్రహ ప్రతిష్టాపన దాతలు:**

- **విగ్రహ దాతలు:** మాడిశెట్టి రవీందర్, వెంకటేష్ బ్రదర్స్
- కలర్స్ మెండి: సరిత ప్రభాకర్
- గ్రిల్స్ గేటు: అల్వాల అమృత సురేందర్
- మకర తోరణాలు: వట్టిపల్లి యాదగిరి
- గ్రానైట్ దాతలు: పొగాకుల లలిత వెంకటాద్రి, కె. రమేష్, వేముల జనార్ధన్ రెడ్డి పాల్గొన్న ప్రముఖులు..

ఈ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మెట్టు బాల్రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు సామల కొండ రెడ్డి, సోమల విజయభా స్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, అబ్బావతిని నరసింహ, సుర్వి శ్రీనివాస్ గౌడ్ తదితరులు, వేద పండితులు, కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవార్ల ప్రతిష్టాపనతో అన్ననగర్ కాలనీలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

# నిరుద్యోగ యువతకు వరం

## మెగా జాబ్ మేళా





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (తెలుగు జనశక్తి) అక్టోబర్ 26:** సింగరేణి కలరీస్ కంపెనీ లిమిటెడ్ సామాజిక బాధ్యత (%జూ=%) కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏఎంసీ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత విస్తృతంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డైరెక్టర్ (పి.పి) కే. వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ మనోజ్, డీసీపీ ఏ. భాస్కర్, సి.ఎం.ఓ ఏఐ ప్రెసిడెంట్ ఎస్. రమేష్, ఎస్.ఓ.టి.యు జి.ఎం విజయప్రసాద్, ఏఐటియుసి నేతలు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ తదితరులు ప్రారంభించారు.

సింగరేణి చైర్మన్ %ఊ% మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో సుమారు 70కి పైగా ప్రైవేట్ కంపెనీలు పాల్గొన్నాయి. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 8,000 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 4,812 మంది మేళాకు హాజరయ్యారు. 2,800 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, సాయంత్రం వరకు 1,200 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి అదే రోజు నియామక పత్రాలు అందజేశారు.

ఉద్యోగ నియామక పత్రాలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, ఎస్.ఓ.టు జి.ఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ కలిసి అందజేశారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్ %ఊ% ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సబ్ కలెక్టర్ మనోజ్, ఏఐటియుసి నాయకులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, నోబెల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డి. సురేష్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ జి. శోభన్ బాబు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో ఎల్లమ్మ మహోత్సవం

## ధ్వజస్థంభ ప్రతిష్ఠతో ఉవ్వెత్తున భక్తి ఉత్సాహం



**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఆర్సి (తెలుగు జనశక్తి)అక్టోబర్ 26:** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. శ్రీ రేణుక ఎల్లమ్మ పరివారం, చింతల పోచమ్మ, ధ్వజ స్థంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు మూడో రోజు (ఆదివారం) అంగరంగ వైభవంగా నిర్వహించ బడ్డాయి. తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్ఛారణలతో హెూమాలు, శాంతి పూజలు ప్రారంబ మయ్యాయి. భక్తి భావంతో భజనలు, శోభాయాత్రల తో ఆలయ ప్రాంగణం మంత్రతంత్రమయంగా మారింది. వేద మంత్రాల నడుమ శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్థంభ స్థాపన ఘనంగా జరిగింది. అనంతరం యజ్ఞం, బలి, పూర్ణాహుతి వంటి పవిత్ర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించగా వేలాదిమంది భక్తులు పాల్గొని భక్తి భావంతో భోజనం చేశారు. సాయంత్రం గ్రామ దేవతలైన ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. మహిళలు, యువకులు నృత్యాలతో, బాణాసంచాతో ఉత్సవాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మొత్తం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. ఈ కార్యక్ర మంలో గౌడ సంఘం కులస్తులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భజన మండళ్లు పాల్గొని దేవీ పూజల్లో భాగమయ్యారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: మచ్చ నరసింహ





**మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ తెలుగు జనశక్తి అక్టోబర్ 26 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల నే లక్ష్యంతో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 237వ వారం నిత్య పూలమాల కార్యక్రమం ఘనంగా జరిగిం ది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు మచ్చ నరసింహ విచ్చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**అంబేద్కర్ జీవితం యువతకు స్ఫూర్తి కావాలి**

ఈ సందర్భంగా మచ్చ నరసింహ మాట్లా డుతూ, డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపం చ దేశాల్లో చదివిన మేధావి అని, ఆయనకు 18 డిగ్రీలు ఉన్నాయని గుర్తు చేశారు. అంతటి మహెూన్నతమైన వ్యక్తిని యువత తమ దార్శనికుడిగా ఎంచుకోవాలని పిలు పునిచ్చారు. యువత ఆయన రచనలు చది వి జ్ఞానవంతులు కావాలని, ఆయన అడు గుజాడల్లో నడిచి సామాజికంగా, ఆర్థికం గా, రాజకీయంగా ఎదగాలని కోరారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే అంబేద్కర్ సూత్రాన్ని అనుసరించి, ప్రజలందరూ ఐకమత్యంతో ఉండి, తమ ఓటును సక్రమంగా వినియోగించుకొని, మన రాజ్యాన్ని ఏర్పర్చుకునే దిశగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా నంగేలి పోరాటం. ఈ కార్యక్రమంలో ఎం. అరుణ్ కుమార్ కేరళకు చెందిన వీర మహిళ 'నంగేలి' జీవిత చరిత్రను వివరంగా

***ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 237వ వారం నిత్య పూలమాల కార్యక్రమం***

***యువత అంబేద్కర్ రచనలు చదివి జ్ఞానవంతులు కావాలి***

***బ్రెస్ట్ ట్యాక్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత నంగేలి జీవిత చరిత్ర వివరించిన ఎం. అరుణ్ కుమార్***

వివరించారు.

**కులాధారిత పన్ను:** 19వ శతాబ్దం ప్రారంభంలో ట్రావెన్‌కోర్ రాజ్యంలో దళిత, గిరిజన, బలహీన వర్గాల మహిళలు వక్షోజాలపై వస్త్రాలు ధరించకూడదనే కులవివక్ష ఆచారం ఉండేది. ఒకవేళ ధరించాలంటే, రాజు అనుమతి తీసుకుని, 'బ్రెస్ట్ ట్యాక్స్' (ములకుక్కారం) కట్టాల్సి వచ్చేది. రొమ్ముల పరిమాణాన్ని బట్టి ఈ పన్ను తేడా ఉండేదట.

**నంగేలి ప్రతిఘటన:** అలప్పుళా జిల్లా, చేరితాలా గ్రామానికి చెందిన నంగేలి ఈ రాజు ఆజ్ఞను ధిక్కరించింది. వక్షోజాలపై వస్త్రం ధరించి పొలం పనులకు వెళ్లిన ఆమె, పన్ను కట్టడానికి నిరాకరించింది.

లి వీర మరణం: పన్ను వసూలుకు వచ్చిన ప్రవతియార్‌ను చూసి ఆగ్రహించిన నంగేలి, ఇంట్లోకి వెళ్లి తన రెండు వక్షోజాలను కొడవలితో కోసి సమర్పించి వీరమరణం చెందింది.

**మొదటి సహగమనం:** భార్య మరణాన్ని తట్టుకోలేని నంగేలి భర్త కండప్పన్ ఆమె చితిలోకి దూకి ఆత్మబలిదానం చేసుకున్నారు. ఇది దేశంలో తొలి 'పతీ సహగమనం'గా చరిత్రకారులు చెబుతారు.

లి పర్యవసానం: ఈ ఘటనతో ట్రావెన్‌కోర్ రాజ్యంలో నిరసనలు వెల్లువెత్తగా, రాజు తక్షణమే 'ములకుక్కారం' (బ్రెస్ట్ ట్యాక్స్), 'తలక్కారం' (తల పన్ను)లను రద్దు చేశారు. నంగేలి త్యాగానికి గుర్తుగా ఆ గ్రామానికి ఇప్పటికీ 'ములచ్చి పురంబు' (రొమ్ము కోసిన మహిళ) అనే పేరు వచ్చింది. ప్రజలను చైతన్యపరుస్తున్న ఎం. అరుణ్ కుమార్‌కు మచ్చ నరసింహ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**సూక్తి: పుస్తకాలు చదవడం మాత్రమే జ్ఞానం కాదు**

ఈ కార్యక్రమంలో జి. సచిన్ మాట్లాడుతూ, "కేవలం పుస్తకాలు చదివి వదిలేస్తే ప్రయోజనం ఏముంది? చీడపురు గులు కూడా పుస్తకాలను నమిలేస్తాయి. అంతమాత్రాన జ్ఞానం వచ్చినట్టా?" అని అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కె. నర్సింగరావు (అధ్యక్షుల ు, గంగపుత్ర సంఘం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ), కె. సత్యం, చల్లాపురం నారాయణ, ఇ. వేణు గోపాల్, గంగారాం అంజయ్య, ఇ. జగదీష్, బి. గణేష్ గౌడ్, సి. ఆనంద్, సి. నిఖిల్, ఇ. విష్ణు, జె. అఖిల్, సి. ముఖేష్, లలిత్ తదితరులు పాల్గొన్నారు. ఎం. అరుణ్ కుమార్ విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బీర్కూర్ రోడ్డుపై ధాన్యం ఆరబోతతో

# వాహనదారుల ఇబ్బందులు



**కామారెడ్డి జిల్లా తెలుగు జనశక్తి అక్టోబర్ 26:** బాన్సువాడ మండలం నుండి బీర్కూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. దీంతో రహదారి సగం వరకు ధాన్యం కుప్పలు విస్తరించి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రహదారిపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాలు సమతౌల్యం కోల్పోయి పలువురు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు తెలిపారు. అయితే ఈ పరిస్థితిని అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రతిరోజూ ఈ రోడ్డుపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ధాన్యం కుప్పలను తప్పించుకునే ప్రయత్నంలో వాహనాలు ఒకదానితో ఒకటి ఢీకొనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి" అని వాహనదారులు తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకుని, రైతులు రోడ్డుపై కాకుండా ఇతర ప్రదేశాల్లో ధాన్యం ఆరబెట్టేలా అధికారులు అవగాహన కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# భారీగా తగ్గిన పార్టీ ఫండింగ్..



## అధికారం పోగానే సీన్ రివర్స్..!

తెలంగాణ: అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి రాజకీయ విరాళాల రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పార్టీకి అందిన విరాళాలు గతంతో పోలిస్తే ఏకంగా 97.40 శాతం పడిపోయాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన వార్షిక నివేదికలో ఈ వివరాలు వెల్లడించారు. బీఆర్ఎస్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.15,09,08,141 (రూ.15.09 కోట్లు) మాత్రమే విరాళాలుగా అందాయి. ఈ నిధులలో ఎక్కువ భాగం ట్రస్టుల ద్వారానే సమకూరాయి. ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.10 కోట్లు, ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్లు విరాళాలుగా వచ్చాయి. వ్యక్తిగత విరాళాలు చాలా తక్కువగా నమోదయ్యాయి. ఎస్.రాజేందర్‌రెడ్డి రూ.8.79 లక్షలు, మహమ్మద్ అజార్ రూ.29 వేలు మాత్రమే పార్టీకి అందించారు.

**గత రెండేళ్లతో పోలిస్తే దారుణమైన పతనం**

విరాళాల రూపంలో వచ్చిన ఈ స్వల్ప మొత్తం, గత రెండేళ్ల ఆర్థిక సంవత్సరాల గణాంకాలతో పోలిస్తే పార్టీకి తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టం చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్‌కు మొత్తం రూ.580.52 కోట్లు విరాళాలుగా వచ్చాయి. ఇందులో ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే రూ.495.52 కోట్లు దక్కాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి అదనంగా రూ.85 కోట్లు వచ్చాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పార్టీ అత్యధికంగా రూ.683.06 కోట్ల విరాళాలు పొందింది. అందులో ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.529 కోట్లు, ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.90 కోట్లు, వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి రూ.64.03 కోట్లు వచ్చాయి. ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల వ్యవస్థ రద్దు కావడం, అలాగే 2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ అధికారం కోల్పోవడం వంటి కారణాల వల్లనే విరాళాలు ఇంత భారీగా పడిపోయినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రా యపడుతున్నారు. పార్టీ నాయకత్వం, కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉన్న ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి. విరాళాల తగ్గుదల పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణ వ్యయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

## జేఎన్టీయూ ఫ్లైఓవర్‌పై కారు బీభత్సం..

### సూడాన్ యువకులు అరెస్ట్

హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ సమీపంలో ఆదివారం ఉదయం ఒక కారు బీభత్సం సృష్టించింది. అతి వేగంతో దూసుకొచ్చిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఆ తర్వాత అదుపుతప్పి ఒక ద్విచక్ర వాహనాన్ని సైతం ఢీకొట్టింది. ఈ ఘటన ఉదయం 7.50 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో కారులో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. అందులో ఇద్దరు యువకులు కాగా.. మరో ముగ్గురు యువతులు. కారు నడుపుతున్న యువకులను పోలీసులు తనిఖీ చేయగా.. వారు సూడాన్ దేశస్థులుగా గుర్తించారు. ఈ యువకులు నగరంలో విద్యనభ్యసిస్తూ, శంషాబాద్ ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది.



అయితే, ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న ముగ్గురు యువతులు అక్కడ నుంచి దిగిపోయి హడావుడిగా మరో క్యాబ్ బుక్ చేసుకుని వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనలో ఎవరూ గాయపడకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు వెంటనే సూడాన్‌కు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కారును వారు అద్దెకు తీసుకున్నారా? లేదా ఎవరైనా ఇచ్చారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువతుల ఆచూకీ కోసం కూడా ప్రయత్నిస్తున్నామని దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటున్నారు.

ఇక కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పత్లాపూర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారిపై కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. షిర్డీ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం చేస్తున్న ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. కారులో మొత్తం నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ముంచుకొస్తున్న 'మొంథా'

'మొంథా' తుపాను ఆంధ్రా తీరం వైపు వేగంగా దూసుకొస్తోందని.. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం శనివారం ఉదయం వాయుగుండంగా మారిందని చెప్పారు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం.. ఈ వాయుగుండం ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం ఉదయానికి పూర్తిస్థాయి తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లేదా మంగళవారం తెల్లవారుజామున ఇది తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా అక్టోబర్ 28న సాయంత్రం వేళ కాకినాడ సమీపంలో ఈ 'మొంథా' తుపాను తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

## అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు మంజూరు..!

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీలక అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల ప్రత్యేక నిధులు ( స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ) మంజూరు చేసింది. ఈ నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ ప్రత్యేక నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మునిసిపల్ శాఖ తన ఆదేశాలలో స్పష్టం చేసింది. ఈ చారిత్రక నగరంలో మౌలిక వసతులను మెరుగుపరచడానికి, ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.



ముఖ్యంగా, వర్షాకాలంలో వరంగల్ నగరంలో తీవ్ర సమస్యగా మారుతున్న వరద ముంపు నివారణ పనులకు ఈ రూ.50 కోట్ల నిధులు ప్రధానంగా కేటాయించారు. ఈ నిధులతో వరంగల్‌లోని పోతననగర్, హనుమకొండలోని నయీంనగర్ ప్రాంతాలలో వరదనీటి కాలువల నిర్మాణం పనులు పూర్తి చేయనున్నారు. వీటితో పాటు, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ల ఆదేశాల మేరకు.. హంటర్‌రోడ్‌లోని 12 మోరీల పనులు, ఉర్సు డీకేనగర్, శివనగర్, దేశాయిపేట, చిన్నవడ్డేపల్లి వంటి వరద ముంపు ప్రాంతాలు, అలాగే హనుమకొండలోని సమ్మయ్యనగర్, రామకృష్ణ కాలనీ, తిరుమల బార్ సెంటర్ వంటి ప్రాంతాలలో చేపట్టాల్సిన అత్యవసర అభివృద్ధి పనుల కోసం ఇంజినీర్లు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. ఈ ప్రత్యేక నిధులు విడుదల చేయడం పట్ల మేయర్ గుండు సుధారాణి వరంగల్ నగర ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నగర అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రికి ఉన్న నిబద్ధతను ఈ నిధుల విడుదల తెలియజేస్తుందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా.. నిధుల విడుదలకు సహకారం అందించిన ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా మంత్రులు సురేఖ, సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలకు కూడా మేయర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకొని, వరంగల్ ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వరంగల్ మేయర్, కమిషనర్ స్పష్టం చేశారు.

## పత్తి రైతులకు గుడ్‌న్యూస్.. తేమ శాతం ఎక్కువ ఉన్నా సరే..

తెలంగాణ: పత్తి రైతులకు గుడ్‌న్యూస్. వర్షాల కారణంగా తడిసి ఇబ్బందులు పడుతున్న పత్తి రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం సచివాలయంలో వివిధ పంటల కొనుగోళ్లపై ఉన్నతాధికారులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పత్తి కొనుగోళ్లపై కీలక నిర్ణయాలు తీసుకున్న మంత్రి.. సాధారణంగా పత్తిలో తేమ శాతం 8-12 శాతం వరకు ఉండాలనే నిబంధనను సడలించాలని సీసీఐ అధికారులకు సూచించారు.



వర్షాల నేపథ్యంలో తడిసిన పత్తిని రైతులు ఆరబెడుతున్నా తేమ శాతం తగ్గడం లేదని.. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉన్నా కూడా మద్దతు ధరలతో కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు దళారుల వద్దకు వెళ్లి మోసపోకుండా, కేవలం సీసీఐ కొనుగోలు కేంద్రాలలోనే పత్తి అమ్మకాలు జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పత్తిలో తేమ శాతంపై, అలాగే కొనుగోలు ప్రక్రియలో ఉన్న 'ఎల్1, ఎల్2 మ్యాపింగ్' విధానంపైనా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలి. ఈ-నామ్ సర్వర్‌లో ఏర్పడుతున్న సమస్యతో కొన్ని జిల్లాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.

కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలకు నియమించిన నోడల్ అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని మంత్రి నిర్దేశించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అవుతున్న మొక్కజొన్నను నిరోధించాలని మార్కెటింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక రైతులు నష్టపోకుండా అక్రమ రవాణాను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. మొత్తంగా, రైతులు నష్టపోకుండా ప్రతి గింజకూ మద్దతు ధర దక్కేలా, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇక పత్తి కొనుగోళ్ల తర్వాత మూడ్రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నెలకు రూ.10తో జీవితాంతం ఉచిత వైద్యం..

తెలంగాణ: పదవీ విరమణ పొందిన వేతన జీవులకు కార్మికరాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) ఒక అద్భుతమైన పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. నెలకు కేవలం రూ.10 (సంవత్సరానికి రూ.120) చెల్లించి, ఉద్యోగం నుంచి వైదొలగినప్పటికీ జీవితాంతం నగదు రహిత వైద్య సేవలు పొందే అవకాశం కల్పిస్తోంది. పదవీ విరమణ చేసినా, వీఆర్ఎస్ తీసుకున్నా లేదా ఉద్యోగం మానేసినా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

పదవీ విరమణ లేదా వీఆర్ఎస్ తీసుకున్న నాటికి చివరి ఐదేళ్ల పాటు యాజమాన్యం తప్పనిసరిగా చందా చెల్లించి ఉండాలి.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో పాటు, ఉద్యోగంలో ఉంటూ శాశ్వత వైకల్యం పొందిన వారికి కూడా ఈ సేవలు అందుతాయి.

ఈ పథకం కింద బీమా సొమ్ము చెల్లించినంత కాలం, పదవీ విరమణ చేసిన ఉద్యోగికి, వారి జీవిత భాగస్వామికి ఈఎస్ఐ పరిధిలోని రెగ్యులర్ వేతన జీవులతో సమానంగా ప్రైమరీ, సెకండరీ వైద్య సేవలు లభిస్తాయి. ఈ సేవలను ఈఎస్ఐ డిస్పెన్సరీలు, ఆస్పత్రుల్లో పొందవచ్చు. ప్రాథమిక సేవలు, అవుట్ పేషెంట్ చికిత్స, సాధారణ వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారు. ఈ వైద్యం కోసం ఎక్కడా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత విశ్రాంత ఉద్యోగి మరణించినా, వారి జీవిత భాగస్వామికి వైద్య సేవలను ఈఎస్ఐసీ కొనసాగిస్తుంది.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా:**

పదవీ విరమణ అనంతరం ఉద్యోగం మానేయడానికి స్పష్టమైన కారణాలు పేర్కొంటూ యజమాని నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి.

ఈ పత్రంతో పాటు అవసరమైన దరఖాస్తులు పూర్తి చేసి ఈఎస్ఐసీ శాఖా కార్యాలయంలో సమర్పించాలి.

క్షేత్రస్థాయి అధికారులు పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు.

అర్హుడిగా గుర్తించిన తరువాత విశ్రాంత ఐపీ (బీమా చేయబడిన వ్యక్తి) ఏడాదికి రూ.120 చొప్పున ఒకేసారి నగదు చెల్లించాలి. ఈ నగదు ముందుగానే చెల్లిస్తేనే ఉచిత వైద్య సేవలు అందుతాయి.

వేతన జీవులకు ఈఎస్ఐసీ మంజూరు చేసిన ఈఎస్ఐ పెహచాన్ కార్డుతో ఈ సేవలు తీసుకోవచ్చు.

దరఖాస్తు సమయంలో జీవిత భాగస్వామి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. అప్పుడే దంపతులిద్దరూ వృద్ధాప్యంలో వైద్య సేవలు పొందేందుకు వీలుంటుంది.

తెలంగాణ రీజియన్ పరిధిలో 56 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన కింద నిజామాబాద్, నాచారం, ఆర్‌సీపురం, సిర్పూర్ కాగజ్‌నగర్, వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయి. కేంద్ర కార్మికశాఖ ఆధీనంలో ఉన్న సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రి, వైద్యకళాశాలలో కూడా వైద్య సేవలు పొందవచ్చు. ఈ పథకం ద్వారా వృద్ధాప్యంలో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించుకోవచ్చు.



## అద్భుత ఉపాయం.. చెట్టు కొమ్మలతో ఆదాయం..

ఖమ్మం: నిరుద్యోగ యువతకు అనంతమైన అవకాశాలను అందిస్తూ.. ప్రకృతి మరోసారి తన ఔదార్యాన్ని చాటుకుంటోంది. సాధారణంగా రహదారుల వెంట కనిపించే నిద్ర గన్నేరు లేదా రెయిన్ ట్రీ చెట్లు ఇప్పుడు నిరుద్యోగులకు ఆదాయ వనరుగా మారుతున్నాయి. ఈ చెట్ల కొమ్మలపై పేరుకుపోయే ఒక ప్రత్యేకమైన జిగురు పదార్థం ద్వారా నిజామాబాద్ వంటి ప్రాంతాల యువత జీవనోపాధిని పొందుతున్నారు.

**జిగురు ఉత్పత్తి..**

నిద్ర గన్నేరు చెట్లపై జరిగే ఒక ప్రత్యేక జీవ ప్రక్రియ ద్వారా ఈ విలువైన జిగురు తయారవుతుంది. ఈ చెట్ల కొమ్మలపై కొన్ని కీటక జాతుల సంచారం ఉంటుంది. ఈ కీటకాలు విడుదల చేసే తెల్లటి విసర్జితాలు క్రమంగా కొమ్మలపై గట్టిపడతాయి. అవి గట్టిపడిన తరువాత చిన్న ముద్దలాగా లేదా తెల్లటి పొరలాగా పేరుకుపోతాయి. వృక్షశాస్త్ర అధ్యాపకుల ప్రకారం.. ఈ చెట్టు శాస్త్రీయ నామం సమానంగా సమన్ లేదా ఆఫ్రికాకు చెందిన రెయిన్ ట్రీ. ఈ జిగురును కొందరు రోగనిరోధక ఔషధాల తయారీలో కూడా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

**యువత ఉపాధి..**

నిజామాబాద్‌కు చెందిన రవీంద్ర సింగ్ వంటి యువకులు దీనిని ఒక ఉపాధి మార్గంగా మార్చుకున్నారు. ఖమ్మం జిల్లాలోని తల్లాడ వంటి ప్రాంతాల్లో ఈ జిగురు కొమ్మలను వేరు చేస్తూ వారు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. సేకరణ పద్ధతి ఎలా ఉంటుందంటే.. మొదట ఈ జిగురు ముద్దలను గమనించి, చెట్ల పైకి ఎక్కి ఆ కొమ్మలను నరికి కిందకు పడేస్తారు. అనంతరం జిగురు ఉన్న భాగాన్ని మాత్రమే ఉంచి.. మిగతా కొమ్మలను తొలగించి, వాటిని చిన్న ముక్కలుగా చేసి పొడిలాగా తయారు చేస్తారు. సేకరించిన ఈ జిగురును పాలిష్, రంగులు తయారు చేసే సంస్థలకు విక్రయిస్తారు. ముఖ్యంగా మనం రోజువారీ వాడే షూ పాలిష్ , లిప్‌స్టిక్ తయారీ లో ఈ జిగురును ముడిసరుకుగా ఉపయోగిస్తారు. ఈ జిగురుకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. కిలోకు రూ. 150 నుంచి రూ. 180 వరకు విక్రయిస్తున్నట్లు ఆ యువకులు తెలిపారు. ఇది తమ కుటుంబ పోషణకు సరిపోతుందని పేర్కొన్నారు. నిరుపయో గంగా ఉన్నట్లు కనిపించే చెట్ల కొమ్మలు ఇప్పుడు నిరుద్యోగ యువతకు ఒక ఆదాయాన్ని అందించే ఆర్థిక సాధనంగా మారాయి.

## రమ్యశ్రీ త్యాగానికి సెల్యూట్..!

### ఆరుగురి జీవితాల్లో వెలుగులు..

తెలంగాణ: మానవత్వం, దాతృత్వం మూర్తీభవించిన అద్భుత ఘట్టం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. కేవలం 28 ఏళ్ల చిన్న వయసులోనే బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించబడిన ఓ గృహిణి.. అవయవ దానం ద్వారా ఏకంగా ఆరుగురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలకు కొత్త వెలుగును ప్రసాదించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన బండిగారి రమ్యశ్రీ అనే గృహిణి ఈ అరుదైన దాతృత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.



రమ్యశ్రీ ఈ నెల 21వ తేదీన తన ఇంట్లో ఉన్న సమయంలోనే హఠాత్తుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు అన్ని రకాల చికిత్సలు అందించినప్పటికీ.. రమ్యశ్రీ కోలుకో లేకపోయారు. చివరికి, ఆమె బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈ హృదయవిదారక విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ వైద్య బృందం రమ్యశ్రీ భర్త రాజలింగం, వారి కుటుంబ సభ్యులను సంప్రదించింది. వారు విషాదంలో ఉన్నప్పటికీ, అవయవదానం యొక్క ప్రాముఖ్యత, అది ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టగల అద్భుత అవకాశం గురించి జీవన్‌దాన్ బృందం సున్నితంగా వారికి వివరించింది. రమ్యశ్రీ చనిపోతూ కూడా ఎంతో మందికి ప్రాణదాతగా నిలవాలనే గొప్ప ఉద్దేశంతో ఆమె భర్త రాజలింగం, కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. వారి ఆమోదంతో జీవన్‌దాన్ బృందం అవయవాలను సేకరించే ప్రక్రియను ప్రారంభించింది. రమ్యశ్రీ నుంచి కాలేయం, రెండు కిడ్నీలు, ఒక ఊపిరితిత్తిని విజయవంతంగా సేకరించారు. ఆ తర్వాత ప్రాణాపాయ స్థితిలో ఉండి అవయవాల కోసం నిరీక్షిస్తున్న ఆరుగురు రోగులకు శస్త్రచికిత్సల ద్వారా ఈ అవయవాలను అమర్చారు. అంతేకాకుండా ఆమె రెండు కంటి కార్నియాలను కూడా సేకరించి, చూపులేని వారికి అమర్చి వారికి దృష్టిని ప్రసాదించారు. ఇలా రమ్యశ్రీ తాను ఆరిపోతూ.. ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. రమ్యశ్రీ దాతృత్వం ఎందరికో ఆదర్శనీయం. ఆమె ప్రాణాలను కోల్పోయినప్పటికీ తన అవయవాల రూపంలో ఆరుగురిలో జీవించి ఉందని జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొ. శ్రీభూషణ్‌రాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రమ్యశ్రీ త్యాగం గొప్పతనాన్ని, అవయవదానం ఆవశ్యకతను మరోసారి గుర్తుచేసింది.

## 361 కేసులు.. 40 బస్సుల సీజ్




### ట్రావెల్స్ బస్సుల్లో రవాణాశాఖ ముమ్మర తనిఖీలు

**అనేక బస్సుల్లో ఉల్లంఘనల గుర్తింపు**

కర్నూలు వద్ద బస్సు దగ్ధం ఘటన నేపథ్యంలో ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలను ఏపీ రవాణాశాఖ ముమ్మరం చేసింది. మూడు రోజులుగా అన్ని జిల్లాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆలిండియా పర్మిట్ తీసుకొని, ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇక్కడ తిరుగుతున్న బస్సులపై అధికారులు దృష్టిపెట్టారు. ఆయా బస్సుల రికార్డులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో ఉన్నట్లుగానే బస్సు డిజైన్ ఉందా? ఏమైనా మార్పులు చేశారా? అత్యవసర ద్వారం ప్రయాణికులకు కనిపించేలా ఉందా అక్కడ అదనంగా సీటు, బెర్త్ ఏర్పాటు చేశారా? అన్ని కిటికీలకూ పక్కన అత్యవసర సమయంలో అద్దాలు పగలగొట్టేందుకు వీలుగా సుత్తులు ఉన్నాయా? ప్రయాణికుల లగేజీ కాకుండా.. పార్శిళ్లు రవాణా చేస్తున్నారా? ప్రయాణికుల జాబితా ఉందా వంటివి పరిశీలించారు. శనివారం రాత్రి, ఆదివారం ఉద యం జరిపిన తనిఖీల్లో ఉల్లంఘనలు ఉన్న 361 బస్సులపై కేసులు నమోదు చేశారు. 40 బస్సులను సీజ్ చేశారు.

**83 బస్సుల్లో అగ్నిమాపక పరికరాల్లేవు**

- తనిఖీల్లో 83 బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు లేవని గుర్తించారు.
- 14 బస్సుల్లో ఫైర్ అలారాలు లేవు
- అత్యవసర ద్వారాల వద్ద అదనంగా బెర్తులు ఏర్పాటుచేసినట్లు 11 బస్సుల్లో గుర్తించారు.
- 63 బస్సుల్లో అనధికారికంగా మార్పులు చేసినట్లు బయటపడింది.
- 26 బస్సుల్లో ప్రయాణికుల జాబితా లేదు.
- సరైన రికార్డులు లేకుండానే 11 బస్సులు నడుపుతున్నట్లు గుర్తించారు.
- అత్యధిక వేగంతో వెళ్లినట్లు గుర్తించిన రెండు బస్సులపై కేసులు నమోదు చేశారు.
- అత్యధికంగా నంద్యాల జిల్లాలో 66, ఎన్టీఆర్-42, పల్నాడు-36, ప్రకాశం-34, తిరుపతి-25, అన్నమయ్య-21, కర్నూలు జిల్లాలో 14 కేసులు నమోదు చేశారు.



## శ్రీశైలం భక్తులకు ఉచితంగా పంపిణీ

శ్రీశైలం: హిందువులు ఎంతో పరమ పవిత్రంగా భావించే మాసాల్లో కార్తీక మాసం ఒకటి. శివ, కేశవులకు ఇద్దరికి ఈ మాసం ఎంతో ప్రీతికరం. కార్తీకమాసం నేపథ్యంలో భక్తులు ప్రతి రోజు దీపారాధన చేస్తారు. అలానే ఈ మాసంలో శివుడు, విష్ణువు ఆలయాలకు భక్తులు పోటెత్తు తారు. కార్తీక పౌర్ణమి రోజు ప్రతి ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. చాలా మంది కార్తీక మాసంలో శ్రీశైలం వెళ్లి మల్లన్న దర్శనం చేసుకోవాలని భావిస్తారు. ఈసారి కార్తీక మాసంలో శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉందని అంటున్నారు. ఈ క్రమంలో మల్లన్న భక్తులకు ఆలయ అధికారులు శుభవార్త చెప్పారు. వాటిని పూర్తి ఉచితంగా అందిస్తామని తెలిపారు.

కార్తీక మాసం కావడంతో శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. కార్తీక మాసం పవిత్రతను దృష్టిలో పెట్టుకుని పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీశైలం మల్లన్న దర్శనానికి తరలి వస్తున్నారు. పెరిగిన భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసిన అధికారులు.. వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు.

కార్తీక మాసం నేపథ్యంలో.. వచ్చే నెల అనగా నవంబర్ 14న శ్రీశైలంలో కోటి దీపోత్సవం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మల్లన్న దర్శనం కోసం శ్రీశైలం వచ్చే భక్తులకు ఆలయ పాలక మండలి శుభవార్త చెప్పింది. భక్తులకు ఉచితంగా లడ్డు అందిస్తామని తెలిపారు. స్వామి వారి స్పర్శ దర్శన టికెట్ తీసుకున్న భక్తులకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఈ టికెట్ తీసుకున్న ప్రతి భక్తుడికి ఉచితంగా లడ్డు అందిస్తామని ఆలయ ఛైర్మన్ రమేశ్ నాయుడు తెలిపారు.

కార్తీక మాసం నేపథ్యంలో.. శ్రీశైలం మల్లన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు మొదలయ్యాయి. నవంబర్ నెల 21 వరకు కార్తీక మహోత్సవాలు కొనసాగుతాయని దేవస్థానం ఈవో ఎం శ్రీనివాసరావు తెలిపారు. అలానే కార్తీక మాసం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో భాగంగా రూ.5 వేల గర్భాలయ అభిషేకం, రూ.1500 సామూహిక అభిషేకం టికెట్లను రద్దు చేశారు. అలాగే భక్తులకు రోజూ విడతల వారీగా శివయ్య స్పర్శ దర్శనం కల్పించనున్నారు. ఇప్పుడు స్పర్శ దర్శన టికెట్ కొన్న భక్తులకు లడ్డు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

## వివాహం రిజిస్టర్ చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవు..

ఆంధ్రప్రదేశ్: పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. దీపావళి తర్వాత మొదలయ్యే ఈ శుభ ముహూర్తాల్లో అనేక జంటలు వివాహ బంధంతో ఒక్కటవుతాయి. అయితే చాలా మంది నవదంపతులు పెళ్లిని వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అలసత్వం వహిస్తారు. తర్వాత చూసుకుందాంలే.. అనే ధోరణిలో ఉంటారు. అయితే ఇలా రిజిస్ట్రేషన్‌ను ఆలస్యం చేయడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు, రేషన్ కార్డుల్లో మార్పులు, పాస్‌పోర్టు, భూములకు సంబంధించిన మ్యుటేషన్ వంటి వాటికి ఈ వివాహ ధ్రువపత్రాలు అవసరం అవుతాయి. అందుకే మూడుముళ్ల బంధంతో ఒక్కటై కొత్త జీవితంలోకి అడుగుపెట్టే నవ దంపతులు.. వివాహ రిజిస్ట్రేషన్‌పై దృష్టి పెట్టాలి.

**అప్పటికప్పుడు కావాలంటే కష్టం..**

పెళ్లైన తర్వాత దరఖాస్తు చేసుకోకుండా తేలికగా తీసుకుని.. తర్వాత అవసరం అయినప్పుడు వాటికోసం కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది. అయితే వీటిని ముందుగానే గుర్తించి.. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలి.


**రిజిస్ట్రేషన్‌కు ఇవి తప్పనిసరి..**


రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే పెళ్లి శుభలేక, జీలకర్ర బెల్లం వధూవరులు తలపై పెట్టుకుంటున్నప్పుడు ఫొటో. మంగళసూత్రం కట్టేటప్పుడు, పూలమాలు మార్చుకొనేటప్పుడు తీసుకొన్న ఫొటోలు కావాల్సి ఉంటుంది. ఇక వరుడు, పెళ్లికూతురు జనన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు ఉండాలి. దంపతులు పదో తరగతి చదివి ఉంటే.. మార్కుల జాబితా జిరాక్స్ జత చేయాల్సి ఉంటుంది. పెళ్లికూతురు తరఫున ఇద్దరు సాక్షులు, వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో వార్డు, గ్రామ సచివాలయాల్లో అందజేయాలి. వాటిని సిబ్బంది పురపాలక లేదా పంచాయతీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడ వారు పత్రాలన్నీ పరిశీలించి.. వివాహ ధ్రువపత్రం జారీ చేస్తారు.

**గుడిలో పెళ్లి చేసుకున్నా..**

ఆలయాల్లో పెళ్లి చేసుకునే సమయంలో.. దేవాదాయ శాఖకు ముందస్తుగానే ఫీజు చెల్లిస్తే అధికారులు రసీదు ఇస్తారు. దాని ఆధారంగా వివాహానికి సంబంధించిన ఇతర పత్రాలు, ఫొటోలు, సాక్షుల ధ్రువీకరణ పత్రాలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి దగ్గర, కళ్యాణ మండపాల్లో సంప్రదాయబద్ధంగా వివాహం జరిగిన సందర్భాల్లో.. పత్రాలు అన్ని సరిగ్గా ఉంటే దరఖాస్తు చేసుకున్నప్పటి.. నుంచి మూడు వారాలలోపు రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుంది. ఇక కులాంతర, ప్రేమపెళ్లిళ్లు చేసుకుంటే దాదాపు నెల తర్వాత మ్యారేజ్ సర్టిఫికెట్ మంజూరు అవుతుంది. అయితే ఆలస్యం చేసి మూడు నెలలు దాటితే.. ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# మొంథా తుపాను.. చంద్రబాబు కీలక ఆదేశాలు..





ఆంధ్రప్రదేశ్: మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొ స్తుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నేటి నుంచి బుధవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 28న తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని తెలిపారు. ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొంథా తుపాను నేపథ్యంలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపానును ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన వారిని వెనక్కి రప్పించాలని తెలిపారు.

దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, 'మొంథా' తుఫాన్ ముప్పు నేపథ్యంలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపానును ఎదుర్కోవడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. తుపాను నేపథ్యంలో ఆ ప్రభావిత ప్రాంతాల్లో.. కరెంట్, టెలికాం, తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తుపాన్ వల్ల కలిగే నష్టాలను వెంటనే పరిష్కరించాలని.. సముద్రంలో ఉన్న పడవలను వెనక్కి రప్పించాలని ఆయన సూచించారు. ఈ తుపాన్ సన్నాహక చర్యలను పర్యవేక్షించడానికి, జిల్లాల వారీగా సీనియర్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

'మొంథా' తుఫాన్ రాష్ట్రంపైకి దూసుకొస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడి, క్రమంగా పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం నాటికి తుఫానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

తుఫానును ఎదుర్కోవడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. తుపాను వల్ల కలిగే నష్టం అంచనా, పరిహారం, దాని పంపిణీ, పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు ప్రత్యేక అధికారులు తమ విధులను సక్రమంగా కొనసాగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రస్తుతం, వాయుగుండం విశాఖపట్నానికి 920 కి.మీ, కాకినాడకు 920 కి.మీ, పోర్టుబ్లెయిర్‌కు 510 కి.మీ, చెన్నైకి 890 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది క్రమంగా బలపడి తుపానుగా మారే అవకాశం ఉన్నందున, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులను వెంటనే వెనక్కి రప్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుపాన్ కారణంగా రహదారులు, కాలువ గట్లు, చెరువులు దెబ్బతింటే, వాటిని తక్షణమే మరమ్మతులు చేయాలని కూడా ఆయన సూచించారు.

## బస్సు ప్రమాదం కేసులో ఇద్దరి మీద కేసు నమోదు



కర్నూలు: జిల్లా, చిన్న టేకూరు వద్ద చోటు చేసుకున్న బస్సు యాక్సిడెంట్‌లో 19 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయ్యారు. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి కారణమైన బైకర్ శివశంకర్ మీద కేసు నమోదు అయ్యింది. అతడితో పాటు బైక్ మీద ఉన్న ఎర్రిస్వామి.. మరణించిన శివశంకర్ మీద పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. అతడిపై ఉలిందకొండ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది.

ఇదే ఘటనపై ఉలిందికొండ పోలీస్ స్టేషన్‌లో మరో ఇద్దరి మీద కూడా కేసు నమోదయ్యింది. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, యజమానిపై కేసు నమోదైంది. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన ప్రయాణికుడు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదానికి చోటు చేసుకుందని %ఖీ×=%లో పేర్కొన్నారు. డ్రైవర్‌తో పాటు యజమానిపై బీఎన్ఎస్ 125, 106(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అర్హత లేకున్నా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందినట్లు అధికారుల విచారణలో తేలింది.

ప్రమాదానికి కారణమైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, అర్హత లేకపోయినా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ సంపాదించినట్లు అధికారులు గుర్తించారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య కుటుంబ నేపథ్యం, ప్రవర్తన, అలవాట్లపై అధికారులు ఆరా తీశారు. అతను ఐదో తరగతి వరకే చదువుకున్నాడని, అయితే పదో తరగతి ఫెయిల్ అయినట్లు సర్టిఫికెట్ ఇచ్చి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాడని పోలీసుల విచారణలో తేలింది.

లక్ష్మయ్య మొదట లారీ క్లీనర్‌గా, ఆ తర్వాత డ్రైవర్‌గా పనిచేశాడు. 2004లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నప్పుడు, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందాడు. ఆ తర్వాత లారీ డ్రైవింగ్ మానేసి, కొన్నాళ్లు ట్రాక్టర్ కొని స్వగ్రామంలో వ్యవసాయం చేశాడు. గత ఎనిమిదేళ్లుగా ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. లక్ష్మయ్య తండ్రి రాములు రెండు నెలల క్రితం మరణించారు. అతనికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె, ఒక సోదరుడు, ఇద్దరు అక్కలు ఉన్నారు. లక్ష్మయ్యకు అప్పుడప్పుడు మద్యం సేవించే అలవాటు ఉందని సమాచారం. ప్రస్తుతం కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మరిన్ని వివరాలు తెలిసేందుకు అవకాశం ఉంది.

## గుట్టుగా కానిచ్చేద్దామనుకున్న టీచర్.. చివరికి దొరికిపోయాడు..!



ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా పలు సంక్షేమ పథకాలు అమ లు చేస్తోంది. తల్లికి వందనం, స్కూల్ ట్రావెల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్, సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్‌తో పాటు వసతిగృహాల్ల ఉండే విద్యార్థులకు కూడా ప్రత్యేక కిట్లు అందిస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు. ఇక విద్యార్థుల నమోదు పెంచడానికి ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లు కూడా చేపడుతున్నారు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ చర్యల కారణంగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెరిగింది. అయితే కొన్ని చోట్ల బోగస్ విద్యార్థుల నమోదు కూడా జరిగినట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడు బోగస్ ప్రవేశాలతో అధికారులను బురిడి కొట్టిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో.. ఈ బోగస్ విద్యార్థుల ప్రవే శాల దందా సాగిస్తున్నాడు ఓ ఉపాధ్యాయుడు. అతడు కళ్యాణదుర్గంలో నవోదయ, సైనిక్, ఏపీఆర్‌జేసీ వంటి పాఠశాలల్లో ప్రవేశాలకు కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అయితే ఆ కోచింగ్ సెంటర్‌లో ఉండే 20 మంది విద్యార్థుల పేర్లను ఈ స్కూల్లో నమోదు చేశాడు. కానీ ఆ విద్యార్థులు గొంచిరెడ్డిపల్లి పాఠశాలకు ఎప్పుడూ హాజరు కారు. కానీ విద్యార్థుల కోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయి. అయితే ఈ పథకాల సొమ్మును కాజేసేందుకు బోగస్ విద్యార్థుల పేర్లను నమోదు చేస్తున్నట్లు ఆ ఉపాధ్యాయుడిపై అనేక విమర్శలు వస్తున్నాయి. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు, మధ్యాహ్న భోజనం పథకంలో బియ్యం, సరకులు, కోడిగుడ్లు.. ప్రత్యేక కిట్లలో పుస్తకాలు, యూనిఫాం, బూట్లు తదితర వస్తువులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇలా బయటపడింది బాగోతం..

ప్రభుత్వ పాఠశాలల్లో బోగస్ విద్యార్థుల నమోదు జరుగుతున్నట్లు డీఈఓకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ విషయంలో నిజానిజాలు తేల్చేందుకు డిఈఓ.. డిప్యూటీ డిఈఓను విచారణ అధికారిగా నియమించారు. అనంతరం ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించగా.. విషయం వెలుగులోకి వచ్చింది. తన క్షేత స్థాయి పర్యటనలో.. పాఠశాలతో సంబంధం లేని పిల్లల పేర్లు స్కూల్ అటెండెన్స్ రిజిస్టర్‌లో ఉన్నాయని గుర్తించానన్నారు. కళ్యాణదుర్గంలో ఉన్న ఉపాధ్యాయుడు నడిపించే కోచింగ్ సెంటర్‌లో కూడా తనిఖీలు చేశామన్నారు. అయితే అక్కడ శిక్షణ తీసుకునే పిల్లల పేర్లే.. ప్రభుత్వ పాఠశాల హాజరు పట్టికలో ఉన్నాయని తెలిపారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని.. నిందితుడిపై తదుపరి చర్యలు వారు తీసుకుంటారని వెల్లడించారు.

## తెరపైకి నూజివీడు, కైకలూరు విలీన అంశం..




ఆంధ్రప్రదేశ్: వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన జిల్లాల విభజన సరిగా లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారం కోసం.. మంత్రివర్గ ఉప కమిటీని నియమించింది. గత వైసీపీ ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ నియోజక వర్గాన్ని ఒక జిల్లాగా ప్రకటించింది. దీంతో కృష్ణా జిల్లాలోని నూజివీడు , కైకలూరు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలో కలిశాయి. అయితే నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టీఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలంటూ ఆ ప్రాంత వాసులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. తాజాగా మరో సారి ఈ రెండు ప్రాంతల విలీన ప్రతిపాదన అంశం తెర మీదకు వచ్చింది.

ప్రస్తుతం నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను.. ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాలో విలీనం చేసే అంశానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఇప్పటికే ఈ రెండు ప్రాంతాల ప్రజలతో పాటు ఆయ సంఘాలతో సంప్రదించి అభిప్రాయాలు సేకరించారు. దీని కన్నా ముందే తమను కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల్లో కలపాలని ఈ రెండు ప్రాంతాల ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

జిల్లాల విభజనకు పూర్వం ఈ రెండు నియోజకవర్గాలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉండేవి. నూజివీడు విజయవాడకు చాలా దగ్గర. దీంతో ఆ ప్రాంత వాసులు.. చదువు, వాణిజ్యం, ఉద్యోగాల నిమిత్తం విజయవాడ నగరానికి వెళ్తారు. అయితే విభజన తర్వాత తమకు ఏలూరు జిల్లా అనుకూలంగా లేదని.. ఎన్టీఆర్‌లో కలపాలని ప్రజలు కోరినట్లుగా తెలిసింది. ఇక కైకలూరు విషయానికి వస్తే.. ఇప్పటికీ గుడివాడ డివిజన్ నుంచే ఈ ప్రాంతంలోని పొలాలకు సాగునీరు, విద్యుత్తు సరఫరా అవుతున్నాయి. విద్యకు సంబంధించి చూసుకున్నా.. గుడివాడ డివిజన్ విద్యాశాఖ పరిధిలోనే ఉంది. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కూడా అసెంబ్లీ సమావేశాల్లో కృష్ణా జిల్లాలో కలపాలని లేఖ రాశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు నియోజకవర్గాల విలీనంపై ప్రజాభిప్రాయం సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. త్వరలోనే ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకుంటుందని సమాచారం.

## ఇక ఇంటి వద్దే 47 రకాల వైద్య పరీక్షలు



ఆంధ్రప్రదేశ్: అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం.. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరీ ముఖ్యంగా వైద్య పరీక్షల కోసం వారు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పని లేదు.

ఈ వాహనాల ద్వారా 47 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు, రోగుల ఆరోగ్య వివరా లను ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులలో నమోదు చేస్తారు. ముఖ్యమంత్రి ఆమోదం పొందిన వెంటనే ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 104 మొబైల్ మెడికల్ యూనిట్లు ఉన్నప్పటికీ, వాటిలో చాలా వాహనాలకు మరమ్మతులు అవసరం అని అధికారులు చెబుతున్నారు. పైగా ఈ వాహనాలు నెలకు రెండుసార్లు మాత్రమే గ్రామాలకు వెళ్లడం వల్ల అందరికీ వైద్య సేవలు అందడం లేదు. ఈ నేపథ్యంలో, 'ఆరోగ్య రథం' ద్వారా వైద్య బృందంతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లను కూడా పంపి, నమూనాలను సేకరించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఫలితాలను రోగులకు చేరవేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కుప్పంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం మంచి విజయం సాధించడంతో త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ప్రస్తుతం రాష్ట్రంలో 104 మొబైల్ మెడికల్ యూనిట్లు 936 వరకు ఉన్నాయి. అయితే, వీటిలో 23 వాహనాలకు పెద్ద మరమ్మతులు, 913 వాహనాలకు చిన్న చిన్న మరమ్మతులు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీనివల్ల వైద్య సేవలు అందరికీ సరిగా అందడం లేదు. కొన్నిసార్లు ప్రజలు వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి 'ఆరోగ్య రథం'ను ప్రవేశపెట్టారు. 'ఆరోగ్య రథం'లో వైద్యులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు కూడా ఉంటారు. వారు గ్రామాల్లోనే రోగుల నుంచి నమూనాలను సేకరిస్తారు. ఈ నమూనాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో పరీక్షించి, ఫలితాలను రోగులకు తెలియజేస్తారు. దీని వల్ల గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయి. అక్కడ ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో.. త్వరలోనే దీనిని రాష్ట్రం అంతటా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

## 20వేల ఎకరాలతో ఎకనమిక్ జోన్..

ఆంధ్రప్రదేశ్: అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. రాష్ట్రలో పెట్టుబడులు పెట్టేలా కంపెనీలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు అనేక సంస్కరణలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగానే విశాఖపట్నంలో ఎకనమిక్ జోన్ ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం రెడీ అయ్యింది. దాదాపు 20 వేల ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ పూర్తి చేయడం కోసం ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. దీనిలో భాగంగా తాజాగా విశాఖలో పర్యటించిన మంత్రి నారా లోకే..శ్ విశాఖపట్నం , శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలను కలిపి ఎకనమిక్ జోన్‌గా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నారా లోకేశ్ ఆదేశాల నేపథ్యంలో ఈ నాలుగు జిల్లాల కలెక్టర్లు విశాఖ ఎకనమిక్ జోన్ కోసం 20వేల ఎకరాల భూసేకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా మొత్తం 20 వేల ఎకరాల్లో విశాఖ నుంచే 3-5వేల ఎకరాలు సేకరించాలని భావిస్తున్నారు. ఇక మిగిలిన భూమిని.. మిగతా మూడు జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి నుంచి సేకరించేందుకు అధికారులు ప్రణాళికలు రెడీ చేస్తున్నారు. దీన్ని జాతీయరహదారికి అనుసంధానం అయ్యేలా చేయడేమే కాక.. ఇక్కడ మౌలిక వసతులు ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై అధికారులు సమగ్ర ప్రణాళికలు రెడీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ ఎకనమిక్ జోన్ ఏర్పాటు వెనక ముఖ్య ఉద్దేశం.. దీనికి సంబంధించి నీతి ఆయోగ్.. విశాఖ ఎకనమిక్ రీజియన్ పేరుతో ఒక ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చింది. దీనిలో మొత్తం 8 జిల్లాలు ఉంటాయి. అవే విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విజయనగరం, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలుంటాయి.



# రవితేజపై బాహుబలి ఎపిక్ ఎఫెక్ట్..

రవితేజ, శ్రీలీల హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. మాస్ రాజా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. ఎందుకంటే రవితేజ సరైన హిట్టు కొట్టి చాలా కాలమైంది. అందులోనూ ఈ మూవీ ఇప్పటికే అనేక రిలీజ్ డేట్లు మార్చుకున్నారు. లాస్ట్ ఇయర్ సంక్రాంతికి అనుకున్న సినిమా.. ఎట్టకేలకు అక్టోబర్ 31వ తేదీని లాక్ చేసుకుంది. మరో ఐదు రోజుల్లో రిలీజ్ పెట్టుకొని, నాలుగు రోజుల ముందు ట్రైలర్ లాంచ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇంతలోనే ఈ సినిమా మరోసారి వాయిదా పడనుందనే న్యూస్ వైరల్ అవుతోంది.



'మాస్ జాతర' సినిమాని సోలోగా రిలీజ్ చేయాలని అన్నీ ఆలోచించుకొని అక్టోబర్ 31న తీసుకురావాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. అయితే ఈసారి 'బాహుబలి: ది ఎపిక్' రూపంలో గట్టి పోటీ ఎదురయ్యే పరిస్థితి వచ్చింది. బాహుబలి రెండు భాగాలను కలిపి ఒకే సినిమాగా అదే రోజున రిలీజ్ చేస్తున్నారు దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి. ఇప్పటికే కొన్ని ఏరియాలలో అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఓపెన్ చేస్తే, హాట్ కేకుల్లా టికెట్లు అమ్ముడవుతున్నాయి. ఈ నేపథ్యంలో రవితేజ చిత్రాన్ని ఒక రోజు ఆలస్యంగా థియేటర్లలోకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నారని సమాచారం.

అక్టోబర్ 31 రాత్రి 'మాస్ జాతర' పెయిడ్ ప్రీమియర్లు ప్రదర్శించి, నవంబర్ 1వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయాలని చిత్ర నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ కూడా దీనిపై మాట్లాడారు. "రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి ఎప్పుడొచ్చినా తెలుగు సినిమాకి ప్రైడ్. ఫ్రెష్ గా రిలీజయ్యే కొత్త సినిమా డిస్టర్బ్ అవ్వకూడదని ఎస్ఎస్ కార్తికేయ ఈ నెల 30వ తేదీ నైట్ ప్రీమియర్ షోలు వేస్తున్నాడు. నేను 31వ తేదీ రాత్రి ప్రీమియర్లు వేసి, నవంబర్ 1వ తేదీ రెగ్యులర్ షోలు వెయ్యాలా అని నేను ఆలోచిస్తున్నారు. దానిపై ఇంకా డిసైడ్ కాలేదు. త్రివిక్రమ్ సార్ విదేశాల్లో షూట్ లో ఉన్నారు. ఆయన రాగానే చర్చించుకోవాలి. డిస్ట్రిబ్యూటర్స్ మాత్రం 31 నైట్ ప్రీమియర్ షోలు వేసి, శని ఆదివారాలు అడ్వాంటేజ్ తీసుకుందామనే అంటున్నారు. అలా అయితే 'బాహుబలి'ని వదిలేసి మన సినిమాతో మనం ప్రశాంతంగా ఉండొచ్చు అంటున్నారు. డిస్కస్ చేసుకొని అఫిషియల్ గా బయటకు చెప్తాం" అని అన్నారు.

నాగవంశీ చెప్పినదాన్ని బట్టి చూస్తే, 'మాస్ జాతర' మూవీ ఒక రోజు ఆలస్యంగా నవంబర్ 1న రిలీజ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ పట్టుబట్టి అక్టోబర్ 31వ తేదీనే మాస్ జాతర సినిమాని థియేటర్లలోకి తీసుకొస్తే మాత్రం.. 'బాహుబలి: ది ఎపిక్' దెబ్బ పడే ఛాన్స్ ఉంది. ఎందుకంటే అడ్వాన్స్ బుకింగ్స్ ఆ రేంజ్ లో ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు లాంటి మెట్రోపా లిటన్ నగరాల్లో బుకింగ్స్ ఓపెన్ చేస్తే, కేవలం 24 గంటల్లోనే దాదాపు 61 వేల టిక్కెట్లు అమ్ముడయ్యాయి. పూర్తి స్థాయిలో బుకింగ్‌లు ప్రారంభమైతే ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. రేపు సోమవారం (అక్టోబర్ 27) ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో విడుదలపై క్లారిటీ ఇస్తారని అభిమానులు భావిస్తున్నారు. చూద్దాం నాగవంశీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.




# ఇటు అల్లు అర్జున్‌తో.. అటు నానితో.. పూజా..

పూజా హెగ్డే.. ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో ఒకరు. కానీ ఇటీవల కాలంలో ఆమె ప్రభ తగ్గిపోయింది. వరుస ఫ్లాప్స్ పడటంతో తెలుగులో అవకాశాలు దూర మయ్యాయి. కానీ తమిళం, హిందీ భాషల్లో క్రేజీ ఆఫర్స్ అందుకుంది. అయితే ఈ బుట్టబొమ్మ మళ్లీ తెలుగులోనూ ఛాన్సులు దక్కించుకుంటోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో తీస్తున్న పాన్ ఇండియన్ మూవీ. దానికి తగ్గట్టుగానే స్టార్ క్యాస్టింగ్ ని తీసుకుం టున్నారు. ఇప్పటికే దీపికా పదుకునేని మెయిన్ హీరోయిన్ గా అనౌన్స్ చేశారు. ఆమె సెట్స్ లో అడుగుపెట్టి ఒక షెడ్యూల్ షూటింగ్ కూడా చేసింది. దీపికాతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి మరో ఇద్దరు గ్లామరస్ హీరోయిన్లను ఫైనలైజ్ చేసినట్లు టాక్. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇంతలో ఇప్పుడు పూజా హెగ్డేని కూడా ఈ ప్రాజెక్ట్ లో భాగం చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

అయితే AA 22' లో పూజా హెగ్డే హీరోయిన్ కాదంట. స్పెషల్ సాంగ్ కోసం ఆమెను తీసుకుంటున్నారట. అందులో అల్లు అర్జున్ తో కలిసి ఈ బ్యూటీ స్టెప్పులేస్తోందట. గతంలో బన్నీ – పూజా కలిసి 'డీజే – దువ్వాడ జగన్నాథం', 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించారు. ఇటీవల 'కూలీ' మూవీలో మోనికా సాంగ్‌లో పూజా అదరగొట్టింది.

పాట పెద్ద హిట్టయ్యింది. ఈ లెక్కలన్నీ వేసుకొని పూజాతో ప్రత్యేక గీతం చేయించాలని అట్లీ భావిస్తున్నారట. అందుకుగాను సన్ పిక్చర్స్ వారు ఆమె డిమాండ్ చేసినంత ఇవ్వడానికి రెడీ అయిపోయారట. ఇందులో నిజమెంతనేది తెలియదు కానీ.. బన్నీతో బుట్టబొమ్మ మరోసారి ఆడిపాడనుందనే న్యూస్ అభిమానులను ఆకట్టుకుంటోంది.

నేచురల్ స్టార్ నాని పక్కన పూజా హెగ్డే హీరోయిన్ గా నటించనుందని మరో వార్త ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తోంది. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' సినిమాలో నటిస్తున్న నాని.. ఈ మధ్యనే సుజీత్ డైరెక్షన్ లో ఓ పాన్ ఇండియా మూవీకి పూజ చేసి లాంఛనంగా ప్రారంభించారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై వెంకట్ బోయినపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు త్వరలోనే రెగ్యులర్ షూట్ కి వెళ్లాలని భావిస్తున్నారు. ఆలోపు ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో ఉన్నారు. ఇందులో భాగంగా నానికి జోడీగా పూజా హెగ్డేని తీసుకోడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు కూడా జరిగినట్లు టాక్ నడుస్తోంది.

ఇలా టాలీవుడ్‌లో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ లో పూజా హెగ్డే నటించే అవకాశం ఉందం టూ వార్తలు వస్తున్నాయి. మళ్లీ తెలుగులో బిజీగా మారుతుం దనడంలో సందేహం లేదు. ఆల్రెడీ దుల్కర్ సల్మాన్‌తో కలిసి పూజా ఓ తెలుగు సినిమా చేస్తోంది. తమిళంలో 'జన నాయగన్', 'కాంచన 4' చిత్రాల్లో నటిస్తోంది. హిందీలో ఓ మూవీ షూటింగ్ జరుగుతోంది. మరికొన్ని ప్రాజెక్ట్స్ చర్చలు జరుగుతున్నాయి. మరి రానున్న రోజుల్లో పూజా కెరీర్ ఎలా సాగుతుందో చూడాలి.



# రామోజీ ఫిల్మ్ సిటీలో సమంత సందడి

'మా ఇంటి బంగారం'గా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది అగ్రతార సమంత. ఆమె.. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రూపొందిస్తున్న ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఓ బేబీ' విజయం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగింది. సమంతతో పాటు ఇతర తారాగణంపై చిత్రంలోని కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో సమంత మునుపెన్నడూ చూడని లుక్‌లో కనిపించనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# పవన్‌కి ఇంకో ఆప్షన్ లేదా?

పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్ లో గతంలో 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ సినిమా వచ్చింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పవన్ పాత్రకు సంబంధించిన షూటింగ్ కంప్లీట్ అయినట్లు కొద్ది రోజుల క్రితం చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో వీలైనంత త్వరగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుందని అంతా భావించారు. కానీ ఇప్పుడప్పుడే సినిమా థియేటర్లలోకి వచ్చేలా కనిపించడం లేదు. దీనికి కారణం షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటమే.

'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో పవన్ కళ్యాణ్ పార్ట్ షూటింగ్ ఫినిష్ అయినప్పటికీ, ఇతర పత్రాలకు సంబంధించిన వర్క్ ఫినిష్ చేయాల్సి ఉంది. డ్యూడ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మైత్రీ నిర్మాత రవి శంకర్ ఈ మూవీ అప్డేట్ ఇచ్చారు. పవన్ తన భాగం షూట్ పూర్తి చేశారని, అక్టోబర్ 11 నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ షెడ్యూల్ 20 నుంచి 25 రోజుల్లో ముగించి, వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ చేస్తామని నిర్మాత చెప్పారు. ఆయన చెప్పినట్లుగానే చివరి షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. చిత్రీకరణ ఇప్పుడు పూర్తయినా, విడుదలకు మాత్రం మరో నాలుగు వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉంది.

క్రిస్మస్, సంక్రాంతి సీజన్లలో డేట్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో 'టాక్సిక్', 'పెద్ది', 'ది ప్యారడైజ్', 'విశ్వంభర' సినిమాలు ఉన్నాయి. మే నెల దాకా వెయిట్ చేస్తే నిర్మాతల మీద మరింత భారం పడుతుంది. సమ్మర్ లో రెండు మెగా సినిమాలు ఉన్నాయి కాబట్టి, 'ఉస్తాద్ భగత్ సింగ్' మేకర్స్ ఫిబ్రవరి నెల మీద దృష్టి పెడుతున్నట్లు టాక్ నడుస్తోంది. పైగా ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే.. 15 లేదా 16 తేదీలలో మహా శివరాత్రి పండుగ ఉంది. సో పవన్ కళ్యాణ్ సినిమాని అదే టైంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారట.

ఇప్పటికైతే 2026 ఫిబ్రవరిలో ఏ సినిమా కూడా రిలీజ్ డేట్స్ లాక్ చేయలేదు. నిఖిల్ హీరోగా నటిస్తున్న 'స్వయంభు' చిత్రాన్ని శివరాత్రికి తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నారట. ఒకవేళ 'ఉస్తాద్ భగత్ సింగ్' రావాలని చూస్తే మాత్రం, నిఖిల్ సినిమా వెనక్కి తగ్గే అవకాశం ఉంది. గతంలో ఫిబ్రవరి నెలను డ్రై సీజన్ గా భావించేవారు. అందుకే పెద్ద హీరోల సినిమాలు, భారీ బడ్జెట్ చిత్రాలను విడుదల చేసేవారు కాదు. కానీ ఇప్పుడు అంతా మారిపోయింది. ఆ నెలలో వచ్చిన 'ఉప్పెన', 'తండేల్' లాంటి చిత్రాలు బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించాయి. మరి ఈసారి ఎలాంటి సినిమా పడుతుందో చూడాలి.

# 'ఆల్ఫా' అమ్మాయిలతో 'పఠాన్'?



"ప్రతి దేశం ఒక అరణ్యం లాంటిదే.. దాన్ని పాలించడానికే వస్తున్నారు 'ఆల్ఫా' గర్ల్స్" అంటూ ఇటీవలే తన రాబోయే సినిమా 'ఆల్ఫా'ను ప్రకటించింది అలియా భట్. ఆమె, శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. యశ్‌రాజ్ ఫిల్మ్స్‌లో రాబోతున్న ఈ మొదటి మహిళా గూఢచారి చిత్రాన్ని శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు. ఈ స్పై యాక్షన్ చిత్రంలో బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్ అతిథి పాత్రలో మెరవను న్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దీని గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తోంది. నిర్మాత ఆదిత్య చోప్రా.. 'పఠాన్' తరహా పాత్రతో 'ఆల్ఫా' చిత్రంలో భాగమవ్వాలని షారుక్‌ను కోరినట్లు తెలుస్తోంది. దీనికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనిచిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. అనిల్ కపూర్, బాబీ దేవోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

Printed published and owned by Lande Bhasker printed at Karuna Sree Publications H.no. 3-135/24 Chityal village tadwai mandal district kamareddy Telangana from H.no. 3-135/24 Chityal village Tadwai mandal district Kamareddy Telangana Editor Lande Bhasker RNI no : TELTEL/2024/89275 phone no :9542559271 Email ID:bhaskerlande20@gmail.com